
పెన్ పవర్
తెలంగాణ రౌండప్

ఆర్ఆర్ డెవలపర్స్ లేఅవుట్‌లో
ప్రజాప్రయోజనాల ప్లాట్స్..





రుద్ర కన్‌స్ట్రక్షన్ ఆక్రమణను పరిశీలిస్తున్న హైడ్రా ఇన్‌స్పెక్టర్‌తో, ఎంబరి ఆంజనేయులు..

# మున్సిపల్ గిఫ్ట్ డీడ్‌పై... ప్రైవేటు 'ఎంవోయు' అస్త్రం..!

## అధికారులు అసమర్థులైతే..! అక్రమార్కులదే ఇష్టారాజ్యం..?

- బీజేపి నేత ఎంబరి ఆంజనేయులు ఫిర్యాదుతో 'హైడ్రా' ఇన్‌స్పెక్టర్ విజిట్..
- గిఫ్ట్ డీడ్ స్థలాన్ని పరిశీలించి.. కబ్జాను గుర్తించిన హైడ్రా సిఐ బాలగోపాల్..!
- 'ఎంవోయు' చేసుకున్న సంస్థలపై కేసులు నమోదుకు ఆదేశించినట్టు సమాచారం..!
- కళ్ళెదుటే బహిరంగ కబ్జాలు.. చూసీ చూడ నట్టు వ్యవహరిస్తున్న అధికారులు..?
- 'ఆర్ఆర్' నిర్మాణ సంస్థ గిఫ్ట్ డీడ్ చేసిన స్థలంలో.. 'రుద్ర' కన్‌స్ట్రక్షన్ కమాన్..
- ప్రైవేటు సంస్థల పరస్పర అవగాహన ఒప్పందం(ఎంవోయు)తో కబ్జా..?
- మున్సిపాలిటీకి గిఫ్ట్ చేసిన స్థలంలో..!ప్రైవేటు 'ఎంవోయు' చెల్లుబాటేనా..?
- గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ప్రజాప్రయోజనాలపై.. నిర్మాణ సంస్థల 'ఎంవోయు' అస్త్రమా..?




-4లో

మున్సిపాలిటీకి ఎస్ఆర్ఓ రిజిస్ట్రేషన్ ద్వారా చేసిన గిఫ్ట్ డీడ్‌ను.. రెండు నిర్మాణ సంస్థలు, మధ్య కుదిరిన పరస్పర అవగాహన ఒప్పందం 'ఎంవోయు' అధిగమిస్తుందా..? అన్న ప్రశ్నలు తీవ్రంగా తలెత్తుతున్నాయి.. 29-11-2022న గిఫ్ట్ డీడ్: 9,404.47 చదరపు గజాల ఓపెన్ స్పేస్‌ను మున్సిపాలిటీకిప్రజా ప్రయోజనం కోసం బదలాయించినట్లు పత్రంలో పేర్కొన్నారు.. ఏడు సర్వే నంబర్లు. 615(P), 616, 617, 618, 619(P), 620(P), 621(P)లో ఓపెన్ స్పేస్ ఉన్నట్లు గిఫ్ట్ డీడ్ షెడ్యూల్‌లో నమోదైంది.. రిజిస్టర్డ్ డాక్యుమెంట్: గిఫ్ట్ డీడ్ కుత్బుల్లాపూర్ ఎస్ఆర్ఓలో డాక్యుమెంట్ నెంబర్. 32001/2022గా డాక్యుమెంట్ స్పష్టతను ఇస్తుంది.. గిఫ్ట్ చేసిన స్థలాన్ని ప్రజా ప్రయోజనం, సాధారణ ప్రజల వినియోగం కోసం కేటాయించినట్లు గిఫ్ట్ డీడ్‌లో పేర్కొన్నారు.. సరిగ్గా మూడేళ్ళ తర్వాత 2025లో ప్రైవేట్ 'ఎంవోయు' విశ్వసాయి టౌన్‌షిప్ ప్లాట్ యజమానులు- రుద్ర కన్‌స్ట్రక్షన్స్ మధ్య 24-05-2025న కుదిరిన ఒప్పందంలో, 45 అడుగుల రహదారి అభివృద్ధి, వినియోగంపై ఈ పరస్పర ఒప్పందం చెల్లుబాటు అవుతుందా..? ఎంవోయులో రహదారిని అభివృద్ధి చేయడం, సీసీరోడ్డు తోపాటు లైటింగ్, మొక్కలు నాటడం, తదితర బాధ్యతలను రుద్ర కన్‌స్ట్రక్షన్స్ తీసుకున్నట్లు పేర్కొన్నారు..డ్రైనేజీ, టౌన్‌షిప్ వర్షపు నీటి డ్రైనేజీకి మార్గం, సెప్టిక్ ట్యాంక్ కనెక్షన్, ఎగ్జిట్ సదుపాయాల కల్పనకు 'ఎంవోయు'లో ప్రస్తావించారు. 24 గంటల రాకపోకలు: 45 అడుగుల రహదారిపై 365 రోజులూ నిరంతర రాకపోకలకు అవకాశం కల్పించేందుకు అంగీకారం తెలిపినట్లు పత్రంలో పొందుపరిచారు.. ఈ రెండింటిపై అనేక ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. 'ఎంవోయు'తో ప్రజాప్రయోజనాల స్థలంలో నిర్మాణాలు సాధ్యమేనా..? ప్రైవేట్ సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేసిన స్థలానికి ప్రైవేటు వ్యక్తులకు హక్కులు కల్పిస్తాయా..? అన్నది అధికారులే తేల్చాలి..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 29:

---

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి




దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో అధికార యంత్రాంగం బరితెగింపు విధులు, రోజు రోజుకు మితిమీరి పోతున్నాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. నిమిత్తమాత్రుడిగా సర్కిల్ ఉన్నతాధికారి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో పాటు..! హెచ్ఎండిఏలో విధులు వెలగబెట్టిన ఓ అధికారి, అక్రమ నిర్మాణాల నియంత్రణ కోసం ఇక్కడ బాధ్యతలు చేపట్టినా ప్రయోజనం శూన్యం.. నిర్మాణాల నియంత్రణకు 'విధుల' సంగతేమో కానీ..! నిధుల వేటలో ఉన్నట్లు ఆరోపణలు వస్తుండగా..? మరో టౌన్‌ప్లానింగ్ అధికారికి తెలుగు సక్రమంగా రాకపోయినా..! ఒక్కో అక్రమ కట్టడానికి, రూ.లక్షల్లో వసూళ్ళు చేస్తున్నట్టు సమాచారం.. అందుకు నిదర్శనం కార్యాలయం చుట్టూ సమీపంలోనే అక్రమ నిర్మాణాలు సాక్షాత్కారిస్తాయి.. ఇక వీళ్ళకు తోడు ఓ ఔట్ సోర్సింగ్ సిబ్బంది తోడై చక్రం తిప్పుతున్నట్టు తాజా ఆరోపణలు గుప్పుమంటున్నాయి.. మొత్తానికి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల దందా "మూడు పూవులు ఆరు కాయలు" అన్న చందంగా విరాజిల్లుతోందని మున్సిపల్ ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఏదిఏమైనప్పటికీ దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారులు చేపట్టే ప్రతి చర్యల్లోనూ, ఒక థియరీ ఉంటుందని, బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ తరహాలోనే ఏకపక్ష చర్యల ప్రక్రియ ఉంటుందని ప్రజల్లో వ్యతిరేకత వినిపిస్తుంది.. ఏదోఒక లాభాపేక్ష లేకుండా ఇంతటి సాహసం ఉండదని, పలువురు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 29:

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో దుండిగల్ సిఎంసి చర్యలు..




# వదిలేసిన అక్రమ షెడ్లు.. అధికారుల ఆత్మీయులవా..?

- బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో "బతుకమ్మ ఆటస్థలం" కబ్జాపై ఏకపక్షంగా చర్యలు..?
- ముడుపులిస్తే వదిలేస్తాం.? లేకుంటే కూల్చేస్తాం..? నియంతృత్వ విధానాలా..?
- వికలాంగుడిని సైతం వదలని సిఎంసి..! వదిలేసిన అక్రమ షెడ్లకు ప్రాధాన్యతేంటి..?



వివరాలు 5లో..


## వేములవాడలో ప్రారంభం
## కానున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలపై సమీక్ష..



- సెప్టెంబరు 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు క్రీడా సంబరాలు..!
- అండర్-20 బాలురు, అండర్-16 బాలికల విభాగాల్లో 34 జట్లు..!
- హాజరుకానున్న 1,358 మంది క్రీడాకారులు, అధికారులు..!
- మట్టిలోని మాణిక్యాలను వెలికితీయడమే లక్ష్యం:వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.

-6 లో

# మున్సిపల్ గిఫ్ట్ డీడ్‌పై.. ప్రైవేటు 'ఎంవోయు' అస్త్రం..!


भारतीय गैर न्यायिक
पचास रुपये रु.50 FIFTY RUPEES Rs.50
INDIA NON JUDICIAL
తెలంగాణ तेलंगाना TELANGANA P 955874
S.No 26052 Date 29/11/2022 Rs.
Sold to: Sama Rupavathy
S/o W/o D/o: Sama Ram Reddy
FOR WHOM: M/s R R Developers
CH. SWAPNA LICENCED STAMP VENDOR LIC. No.: 15-21-004/2014 Ren. No.: 15-21-014/2020 H.No. 201, Sri Krishna Nagar Colony, Gajularamaram, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dt. Ph:8333050286

GIFT SETTLEMENT DEED FOR CHARITABLE PURPOSE GENERAL PUBLIC USE:


This Deed of Gift Settlement for public purposes General Public Use is made and executed on this the 29th day of November 2022 by and between:

M/s. R.R.DEVELOPERS (Partnership Firm) (Reg. No.2797/2012) (PAN AAPFR5566F), having registered Office at Plot No.161, Durga Vihar Colony, Tirumalgherry, Secunderabad - 500 015 (Partnership was originally constituted on 24th October 2012 with two partners, Later on Reconstituted on 8th April 2013 with five partners and Now as on latest Reconstituted on 3rd September 2013 with six partners), represented by its Managing Partner Smt. SAMA RUPAVATHY W/o. Sri SAMA RAM REDDY, aged about 54 years, Occupation: Business, Resident of LIG -31, APHB, Balaji Nagar, Kukatpally, Hyderabad - 500 072., (PAN: AHDPR2350Q, AADHAR: 3000 8062 9914) (authorized by all the Partners of Partnership vide Resolution dated 15th March 2015)

Hereinafter called the "DONOR" shall unless repugnant to the subject or context shall mean and include all its respective legal heirs, agents assigns, administrators, successors, legal representatives etc.,

For RR DEVELOPERS
S Rupavathi
Authorised Signatory

మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేసిన డాక్యుమెంట్..




MEMORANDUM OF UNDERSTANDING – CUM - AGREEMENT

THIS MEMORANDUM OF UNDERSTANDING is made and executed on this the 24th Day of May, 2025 at Hyderabad by and between:

VISHWA SAI TOWNSHIP PLOT OWNERS formed as a residential community built in open land admeasuring Ac 30.08 Gts in Sy Nos 615(P), 616(P), 617, 618, 619(P), 620 (P) & 621 (P), SITUATED AT DUNDIGAL VILLAGE, MEDCHAL-MAKLAJGIRI DIST., TELANGANA 500043

Hereinafter to be called and referred as the "FIRST PARTY" which term unless the context repugnant thereto shall mean and include all his/her/their heirs, successors, representatives, executors, administrators, and assignees etc., of the FIRST PART.

AND

M/s. RUDHRA CONSTRUCTIONS PRIVATE LIMITED, having its Registered Office at RUDHRA HOUSE 3rd AND 4th FLOORS PLOT NOS.8&9, ANAND NAIDU NAGAR, PRAGATHI NAGAR, BACHUPALLY MANDAL, HYDERABAD-500090. Rep.by its Managing Director: SRI.PALLEMPATI NAVEEN S/O.SRI.P.RAMACHANDRA RAO, aged about 44 Years, Occupation: Business, Resident of FLAT NO. 403, PLOT NOS. 98, 99 AND 100, RAMACHANDRA RESIDENCY, SRINIVASA NAGAR COLONY, NIZAMPET, HYDERABAD-90, TELANGANA STATE. (PAN NO. AAHCR6185M) (AADHAR NO. 2431 7526 2786)

Hereinafter to be called and referred as the "SECOND PARTY" which term unless the context repugnant thereto shall mean and include all his/her/their heirs, successors, representatives, executors, administrators, and assignees, Plot Owners/ Residential Owners, Vehicles etc., of the SECOND PART.

WHEREAS, The FIRST PARTY herein are formed as a residential community in open land admeasuring Ac 30.08 Gts, in Sy Nos 615(P), 616(P), 617, 618, 619(P), 620 (P) & 621 (P), SITUATED AT DUNDIGAL VILLAGE, MEDCHAL-MAKLAJGIRI DIST., TELANGANA 500043.

For RUDHRA CONSTRUCTIONS PVT. LTD.
Managing Director

రెండు నిర్మాణ సంస్థలు చేసుకున్న 'ఎంవోయు'..


గిఫ్ట్ డీడ్ చేసిన స్థలంలోనే కమాన్ నిర్మాణం వద్ద, హైడ్రా అధికారి, పత్రాల పరిశీలన..

- 3 పేజి తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ సర్కిల్-59 మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేసిన ప్రజాప్రయోజనాల స్థలంలో నిర్మాణాలు సాధ్యమేనా..?ప్రైవేట్ 'ఎంవోయు'తో ప్రజల వినియోగానికి వదిలిన స్థలాల కబ్జాలపై చట్టపరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. దుండిగల్ గ్రామ పరిధిలోని ఓ లేఅవుట్‌కు సంబంధించి మున్సిపాలిటీకి ప్రజా ప్రయోజనం, ప్రజల వినియోగం కోసం సబ్ రిజిస్ట్రార్ నుండి, రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ ద్వారా బదలాయించిన ఓపెన్ స్పేస్‌పై నిర్మాణాలు చేపట్టే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.. ఒకవైపు 29-11-2022న రిజిస్టర్ అయిన గిఫ్ట్ డీడ్‌లో 9,404.47 చదరపు గజాల ఓపెన్ స్పేస్‌ను మున్సిపాలిటీకి గిఫ్ట్ చేసినట్లు పేర్కొనగా, మరోవైపు 24-05-2025న రెండు ప్రైవేట్ సంస్థల మధ్య కుదిరిన 'ఎంవోయు'లో 45 అడుగుల రహదారి అభివృద్ధి, రాకపోకలు, డ్రైనేజీ తదితర అంశాలు పొందుపరిచినట్లు తెలుస్తోంది.. మున్సిపాలిటీకి అప్పగించిన స్థలం ఎవరిది..?గిఫ్ట్ డీడ్‌లో సర్వే నెంబర్: 615(P), 616, 617, 618, 619(P), 620(P), 621(P)లో మొత్తం 9,404.47 చదరపు గజాల (7,862.13 చ.మీ.) ఓపెన్ స్పేస్‌ను ప్రజా ప్రయోజనాల కోసం మున్సిపల్ కమిషనర్‌కు ఎటువంటి ప్రతిఫలం లేకుండా గిఫ్ట్ చేసినట్లు పేర్కొన్నారు.. అదే పత్రం 29-11-2022న కుత్బుల్లాపూర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెంబర్: 32001/2022గా రిజిస్టర్ అయినట్లు చూపుతోంది..

## ప్రైవేట్ 'ఎంవోయు'ను అస్త్రంగా.. హక్కును పొందుతారా..?

**కట్ చేస్తే సరిగ్గా మూడేళ్ళ అనంతరం 24-05-2025న విశ్వసాయి టౌన్‌షిప్ ప్లాట్ యజమానులు, రుద్ర కన్‌స్ట్రక్షన్స్ మధ్య కుదిరిన ఒక 'ఎంవోయు' 45 అడుగుల రహదారి అభివృద్ధితో పాటు, పలు మౌలిక వసతుల కల్పనకు ఇరువురి నడుమ పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు..అయితే, ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థల మధ్య కుదిరిన 'ఎంవోయు' స్వయంగా మున్సిపాలిటీకి చెందిన ప్రజల ఆస్తిపై యాజమాన్య హక్కును సృష్టించదనే వాదనలు వినిపిస్తున్నాయి.. ముఖ్యంగా మున్సిపాలిటీకి రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ ద్వారా బదలాయించిన ఓపెన్ స్పేస్‌ను ఇతర ప్రయోజనాలకు వినియోగించాలంటే, సంబంధిత మున్సిపల్ సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయిలో అనుమతులు తప్పనిసరి తీసుకోవాలని పలువురు ఆరోపిస్తున్నారు.. ప్రజా ప్రయోజనం కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు..? చేపట్టకూడదని సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి..**

## ఇరువురిపై కేసునమోదుకు ఆదేశం..?

29 ఎకరాల్లో లేఅవుట్ వేసిన విశ్వసాయి టౌన్‌షిప్ లేఅవుట్‌ను అభివృద్ధి చేసి ప్లాట్ల విక్రయాలు పూర్తి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్న అంశంపై, హైడ్రా అధికారి కీలక డాక్యుమెంట్లు పరిశీలించారు.. మున్సిపాలిటీకి చేసిన గిఫ్ట్ డీడ్‌ను..! ఆర్ఆర్ డెవలపర్స్-రుద్ర కన్‌స్ట్రక్షన్ మధ్య కుదిరిన పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయు)ను హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ కూలంకషంగా పరిశీలించారు.. ఒక ప్రైవేటు వ్యక్తుల నడుమ కుదుర్చుకున్న 'ఎంవోయు'ను ప్రామాణికంగా తీసుకున్న నిర్మాణ సంస్థలు.. చట్టపరంగా రిజిస్ట్రేషన్ ద్వారా మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేసిన, ప్రజాప్రయోజనాల స్థలం, ఆక్రమణకు గురైనట్లు ఆయన గుర్తించారు.. రెండు నిర్మాణ సంస్థలపై వెంటనే పోలీసు కేసులు నమోదు చేయాలని, మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.. ఫిర్యాదు దారుడు బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులుతో కేసునమోదు విషయాన్ని ప్రస్తావించగా, నిజమేనని తెలిపారు..

## బీజేపీ నేత ఫిర్యాదుతో హైడ్రా సీఐ సందర్శన..

మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేసిన స్థలంలో అక్రమ నిర్మాణాలు ఏమిటని.. 9,404 గజాల ప్రజాప్రయోజనాల స్థలం ఆక్రమణలపై ఈనెల 6వ తేదీని బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులు, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.. దీంతో హైడ్రా అధికారులు స్పందించారు.. గిఫ్ట్ డీడ్ చేసిన ప్రజాప్రయోజనాల స్థలంలో, రుద్ర కన్‌స్ట్రక్షన్ సంస్థ అక్రమ కమాన్ నిర్మాణాన్ని హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ మున్సిపల్ సిబ్బంది, ఫిర్యాదు దారునితో కలిసి శుక్రవారం సందర్శించారు..బీజేపీ నేత ఆంజనేయులు తెలిపారు..దుండిగల్ గ్రామంలోని విశ్వసాయి టౌన్‌షిప్‌లో మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ ద్వారా బదలాయించిన ప్రజా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఎంబారి అంజనేయులు హైడ్రా కమిషనర్ ఫిర్యాదులో ఆర్ఆర్ డెవలపర్స్, రుద్ర కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన పలు అంశాలను కీలకంగా ప్రస్తావించారు..



ప్రజా ప్రయోజనాలు ఆక్రమించి, రుద్ర కన్‌స్ట్రక్షన్ కమాన్..



# ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు (కేకే) నేతృత్వంలోని కమిటీ ప్రతినిధి బృందం శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పాల్గొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా నిర్వహించిన విస్తృత స్థాయి సంప్రదింపుల వివరాలను కమిటీ ముఖ్యమంత్రికి వివరించింది. ఈ సంప్రదింపుల్లో 13 వేల మందికి పైగా తెలంగాణ ఉద్యమకారులతో పాటు వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారులు పాల్గొన్నట్లు కమిటీ తెలిపింది. ఉద్యమకారుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తులతో పాటు ఉద్యమకారుల వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తిస్తూ వారి సేవలకు తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు కమిటీ వెల్లడించింది. ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన కసరత్తును ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్, పోర్టల్ ఏర్పాటు, డిజిటల్ దరఖాస్తుల స్వీకరణ, జిల్లాల వారీగా సమన్వయం, అవసరమైన పరిపాలనా వనరుల కల్పన వంటి అంశాల్లో కమిటీకి పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.సమావేశంలో సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, ఐఏఎస్, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఐఏఎస్, వి.పి. గౌతమ్, ఐఏఎస్, ఎస్. శ్రీధర్, ఐఏఎస్, ముఖ్యమంత్రి ఓఎస్డీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లైన 250 గజాల నివాస స్థలాలు, ఆసరా పెన్షన్, ఆరోగ్య కార్డులు, ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం, ఉద్యోగులకు గౌరవ గుర్తింపు తదితర అంశాలను కమిటీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జీవో నెం. 679 ద్వారా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్లపై సానుకూలంగా స్పందించినందుకు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మోతె శోభన్‌రెడ్డి, ఎస్. రాములు నాయక్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.




దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో అధికార యంత్రాంగం బరితెగింపు విధులు, రోజు రోజుకు మితిమీరి పోతున్నాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. నిమిత్తమాత్రుడిగా సర్కిల్ ఉన్నతాధికారి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో పాటు..! హెచ్ఎండిఏలో విధులు వెలగబెట్టిన ఓ అధికారి, అక్రమ నిర్మాణాల నియంత్రణ కోసం ఇక్కడ బాధ్యతలు చేపట్టినా ప్రయోజనం శూన్యం.. నిర్మాణాల నియంత్రణకు 'విధుల' సంగతేమో కానీ..! నిధుల వేటలో ఉన్నట్లు ఆరోపణలు వస్తుండగా..? మరో టౌన్‌ప్లానింగ్ అధికారికి తెలుగు సక్రమంగా రాకపోయినా..! ఒక్కో అక్రమ కట్టడానికి, రూ.లక్షల్లో వసూళ్ళు చేస్తున్నట్టు సమాచారం.. అందుకు నిదర్శనం కార్యాలయం చుట్టూ సమీపంలోనే అక్రమ నిర్మాణాలు సాక్షాత్కారిస్తాయి.. ఇక వీళ్ళకు తోడు ఓ ఔట్ సోర్సింగ్ సిబ్బంది తోడై చక్రం తిప్పుతున్నట్టు తాజా ఆరోపణలు గుప్పుమంటున్నాయి.. మొత్తానికి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల దందా "మూడు పూవులు ఆరు కాయలు" అన్న చందంగా విరాజిల్లుతోందని మున్సిపల్ ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఏదిఏమైనప్పటికీ దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారులు చేపట్టే ప్రతి చర్యల్లోనూ, ఒక థియరీ ఉంటుందని, బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ తరహాలోనే ఏకపక్ష చర్యల ప్రక్రియ ఉంటుందని ప్రజల్లో వ్యతిరేకత వినిపిస్తుంది.. ఏదోఒక లాభాపేక్ష లేకుండా ఇంతటి సాహసం ఉండదని, పలువురు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు..

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 29:**

బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో, దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు విమర్శల పాలవుతోంది.. డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణికరణ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ సమక్షంలో కొనసాగిన ఈ అక్రమ షెడ్ల కూల్చివేతలపై పూర్తిస్థాయి పర్యవేక్షణలోనే చర్యలు చేపట్టారా..? అన్న ప్రశ్నలు లేవనెత్తుతోంది.. అసలు అక్రమ షెడ్లు ఏంటి..? అధికారుల చర్యలేంటి..? కబ్జాకు గురైన ఆ స్థలం ఎవరిది..? అనే విషయాన్ని కూలంకషంగా చూద్దాం.. బౌరంపేట ఇందిరమ్మ కాలనీలోని పార్కు పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో కొన్నేంళ్ళుగా, తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన "బతుకమ్మ"కు ఆటస్థలంగా వినియోగిస్తున్నారు.. ఖాళీగా ఉన్నందున పేదలు చిన్నచిన్న శుభకార్యాలు కూడా జరుపుకుంటారరట..అయితే సంబంధిత స్థలంపై కొందరి కన్ను పడింది.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన షట్టర్లతో, బతుకమ్మ ఆటస్థలం "వ్యాపార సముదాయ కేంద్రంగా" మార్చేశారు.. రెండు నెలల క్రితం స్థానికుల ఫిర్యాదుతో,ఇక్కడే ఇదేతరహా, కూల్చివేతలు చేపట్టారు.. మళ్ళీ యధావిధిగా దాదాపు 30-40 అక్రమ షెడ్లు వెలిశాయట.. దీంతో స్థానికుల ఫిర్యాదుతో శనివారం (నిన్న) జేసీబీతో వెళ్ళిన సిఎంసి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చేశారు.. దీనికి సమీపంలోనే ఎలాంటి అనుమతులు లేకుండా, సెట్‌బ్యాక్‌లు పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మరో భవనాన్ని గుర్తించిన, సిఎంసి అధికారులు ఎప్పటి లాగనే, ఫొటోషూట్ కూల్చివేతలు చేపట్టినట్టు ఆ దృశ్యాలే స్పష్టతను ఇస్తున్నాయి.. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరన్, ఏసిపి శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొని అక్రమ నిర్మాణాలపై కఠినంగా చర్యలు తీసుకున్నామని ప్రెస్‌నోట్ ద్వారా తెలియజేశారు.. అయితే కఠినమైన చర్యలో..! లేక కమిట్‌మెంట్ (ఒప్పందపు) కూల్చివేతలో నాలుగు రోజుల్లో బట్టబయలు అవుతాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తే భవిష్యత్తులోనూ ఇలాంటి కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.. అయితే అధికారుల హెచ్చరికలకు, అక్రమ నిర్మాణాలకు పొంతన లేకపోయినా..! ప్రజల సొమ్మును వేతనాలుగా పొందుతున్నారు కాబట్టి.. మనం గొర్రెల్లా నమ్మాల్సిందేనని.. ప్రజలు వెటకారపూరిత, అసహనం వ్యక్తం చేస్తున్నారు..

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో దుండిగల్ సిఎంసి చర్యలు..




# వదిలేసిన అక్రమ షెడ్లు.. అధికారుల ఆత్మీయులవా..?

- బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో "బతుకమ్మ ఆటస్థలం" కబ్జాపై ఏకపక్షంగా చర్యలు..?
- ముడుపులిస్తే వదిలేస్తాం.? లేకుంటే కూల్చేస్తాం..? నియంతృత్వ విధానాలా..?
- వికలాంగుడిని సైతం వదలని సిఎంసి..! వదిలేసిన అక్రమ షెడ్లకు ప్రాధాన్యతేంటి..?

- వదిలేసిన అక్రమ షెడ్లకు.. ముడుపులు ముట్టాయా..? అంటూ ప్రశ్నల వెల్లువ..?
- కొందరి అక్రమ షెడ్లకు మినహాయింపు..! మరికొందరిపైనే కూల్చివేతలా..?
- వదిలేసినవి అధికారుల బంధువులా..? ఆఫీసులో పనిచేస్తే చర్యలు ఉండవా..?
- దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ చర్యలపై స్థానికుల మండిపాటు..
- మున్సిపల్‌లో విధులు వెలగబెడుతున్న ఓ మహిళ, పనే అంటూ బాధితుల ఆరోపణ..
- దుండిగల్ సర్కిల్ సిఎంసి డిప్యూటీ కమిషనర్‌కు, బాధితుల ఫిర్యాదు..




బౌరంపేట్‌లోనే నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణంలో చర్యలు..

## వదిలేసిన అక్రమ షెడ్లకు అంత ప్రాధాన్యతేంటి..?

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలోని బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలోని, ఖాళీ స్థలాల కబ్జాలపై, సిఎంసి కూల్చివేతలు, అధికారుల పక్షపాత ధోరణిని బట్టబయలు చేస్తోంది.. బతుకమ్మ పండుగకు మహిళల ఆటపాటలకు, కేటాయించిన ప్రభుత్వ భూమిలో, వెలసిన అక్రమ నిర్మాణాలను శనివారం దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారులు కూల్చేశారు.. అయితే అక్రమ షెడ్లను కొందరివి మాత్రమే కూల్చేసిన అధికారులు, మరికొందరికి మినహాయింపు ఇవ్వడం స్థానికంగా ప్రశ్నలు లేవనెత్తుతోంది.. ఈ చర్యల వ్యవహారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సమక్షంలో జరగటం బాధాకరం అంటూ బాధితులు ఆవేదన చెందారు.. దీంతో డిప్యూటీ కమిషనర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.. "బతుకమ్మ ఆటస్థలం" కబ్జాలో ఈ పక్షపాత ధోరణి చర్యలేమిటని, మిగతావి ఎందుకు కూల్చివేయలేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు..

## ఆ మహిళా సిఫార్సులే: బాధితుల ఆరోపణ..

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బతుకమ్మ ఆటస్థలం కబ్జా వ్యవహారంలో, మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ విధులు నిర్వర్తించే ఓ మహిళా సిబ్బంది సిఫార్సులు చేసిన, అక్రమ షెడ్లకు మాత్రమే, కూల్చివేతల మినహాయింపు కల్పించారని..! మిగతా వారి షెడ్లు కూల్చేశారని ఓ వికలాంగ బాధితుడు ఆరోపించాడు.. తనొక వికలాంగుడిని అని చూడకుండా, తనను నష్ట పరిచిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, మిగతా అక్రమ షెడ్లు ఎందుకు కూల్చివేయలేదని ప్రశ్నించాడు.. మున్సిపాలిటీలో పనిచేస్తుందన్న కారణంతో సంబంధిత మహిళ సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.. వదిలేసిన అక్రమ షెడ్లను పూర్తిగా కూల్చివేయాలని, డిమాండ్ చేస్తూ, దుండిగల్ సర్కిల్-59 సిఎంసి డిప్యూటీ కమిషనర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.




పోలీసు భద్రత నడుమ బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో కూల్చివేతలు..



అధికారులు కూల్చివేయకుండా వదిలేసిన అక్రమ షెడ్లు ఇవే..

**వేములవాడ, పెన్ పవర్,(ప్రతినిధి) ఆగష్టు 29:** ?రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సెప్టెంబరు 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు రాష్ట్రస్థాయి బాలుర, బాలికల కబడ్డీ పోటీలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఈ పోటీలను అండర్-20 బాలుర, అండర్-16 బాలికల విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని త్రినేత్ర ఫంక్షన్ హాల్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.. రాష్ట్రంలోని 33 జిల్లాలతో పాటు, హైదరాబాద్‌ను రెండు జట్లుగా పరిగణించి మొత్తం 34 జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బాలుర విభాగంలో 34, బాలికల విభాగంలో 34 జట్లు తలపడనున్నాయని వివరించారు. ప్రతి జట్టులో 14 మంది క్రీడాకారులు, ఇద్దరు పీఈటీ/పీడీ/కోచ్ అధికారులు ఉంటారని, మొత్తం 1,358 మంది ఈ క్రీడా సంబరాల్లో పాలుపంచుకుంటారని పేర్కొన్నారు. వీరందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేములవాడ పట్టణంలో ఘన స్వాగతం పలికి, నాణ్యమైన వసతి, రుచికరమైన భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు..

పత్రికా సమావేశంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్..



# వేములవాడలో ప్రారంభం కానున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలపై సమీక్ష..

- సెప్టెంబరు 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు క్రీడా సంబరాలు..!
- అండర్-20 బాలురు, అండర్-16 బాలికల విభాగాల్లో 34 జట్లు..!
- హాజరుకానున్న 1,358 మంది క్రీడాకారులు, అధికారులు..!
- మట్టిలోని మాణిక్యాలను వెలికితీయడమే లక్ష్యం:వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.

## క్రీడలకు సర్కారు పెద్దపీట..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. యువత క్రీడా మైదానాల్లో ఎక్కువ సమయం గడిపేలా ప్రోత్సహిస్తూ తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారని గుర్తుచేశారు. సీఎం కప్ ద్వారా ఇప్పటికే గ్రామీణ, మండల, జిల్లా స్థాయిల్లో 42 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్నామని, భవిష్యత్ ఒలింపిక్స్‌లో తెలంగాణ బిడ్డలు బంగారు పతకాలు సాధించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేర్చేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు..

## ప్రముఖులు హాజరు..

ఈ పోటీలకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఆయన ఇప్పటికే రావడానికి అంగీకరించారని తెలిపారు. వీరితో పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు..



## ప్రత్యేక నిర్వహణ కమిటీ ఏర్పాటు..

పోటీల పర్యవేక్షణ, ఏర్పాట్లు సజావుగా సాగేందుకు ప్రజాప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. స్టేజ్, గ్రౌండ్, భోజన వసతి, వసతి పర్యవేక్షణ, ప్రోటోకాల్ వంటి కమిటీల ద్వారా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. గతంలో ఇక్కడ నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు విజయవంతమైనట్లే, ఈ కబడ్డీ పోటీలను కూడా విజయవంతం చేసి వేములవాడకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు..

## పూర్వ వైభవం తెస్తాం: ఎమ్మెల్యే.

గతంలో వేములవాడ ప్రాంతంలో వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలకు మంచి ఆదరణ ఉండేదని, ఆ సంస్కృతిని కాపాడుతూ దాతలు, క్రీడా ప్రేమికుల సహకారంతో గ్రామీణ క్రీడలకు పూర్వవైభవం తెస్తామని ఎమ్మెల్యే అన్నారు. యువత వ్యసనాలకు దూరమై క్రీడల ద్వారా శారీరక దారుఢ్యాన్ని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించు కోవాలని పిలుపునిచ్చారు. ఈ పోటీలను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ, నియోజకవర్గ ప్రజలు, క్రీడాభిమానులు, మీడియా ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.?సమావేశంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, వేములవాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, స్థానిక కౌన్సిలర్లు, సర్పంచులు, క్రీడా ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు


# కాంగ్రెస్ వైఫల్యాలను గడపగడపకూ ఎండగడతాం:చల్మెడ..

- కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం..!
- సెప్టెంబర్ 2 నుంచి నిరసనల హోరు..!
- 8 మండలాల్లో ఉద్యమ కార్యాచరణ..!
- బీఆర్ఎస్ సత్తా చాటుతాం: చల్మెడ..




**వేములవాడ, పెన్ పవర్,(ప్రతినిధి) ఆగష్టు 29:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలు, వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగడతామని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం వేములవాడలో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు..రాబోయే వారం రోజుల పాటు చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలు, నిరసనలపై సమావేశంలో చర్చించినట్లు చల్మెడ తెలిపారు. నియోజకవర్గంలోని 8 మండలాలు, వేములవాడ పట్టణానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారని పేర్కొన్నారు.. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసి బీఆర్ఎస్ బలాన్ని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గడపగడపకూ తీసుకెళ్తామని స్పష్టం చేశారు. సమావేశానికి తరలివచ్చిన కార్యకర్తల ఉత్సాహాన్ని చూస్తుంటే నిరసనలు వంద శాతం విజయవంతం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులుకార్యకర్తలు పాల్గొన్నారు..

వేములవాడలో బీఆర్ఎస్ శ్రేణుల కార్యవర్గ సమావేశంలో చల్మెడ..



# ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ బహిష్కరణ

**హైదరాబాద్ ఆగస్టు 29, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. వెంటనే ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి.. రాజీనామా లేఖను శాసనమండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎంఐఎం సంయుక్త కార్యదర్శి ఎస్.ఏ. హుస్సేన్ అన్వర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఐఎం ప్రకటించిన వివరాల ప్రకారం.. మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరించారు. అయితే ఆయనపై ఇంత కఠిన చర్య తీసుకోవడానికి దారితీసిన వీడియో లీక్ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. దీంతో అసలు వ్యవహారం ఏమిటన్నదానిపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.రహ్మత్ బేగ్‌పై పార్టీ చర్యలకు వీడియో లీక్ వ్యవహారమే కారణమని ప్రస్తుతం ప్రచారం జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పలు ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు. ఇటీవలే రహ్మత్ బేగ్ తనపై డీప్‌ఫేక్, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను బయటపెడతామంటూ కొందరు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరించారని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి.ఈ పరిణామం జరిగిన మరుసటి రోజే ఎంఐఎం ఆయనను పార్టీ నుంచి బహిష్కరించి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశించడం మరింత ఆసక్తిని రేపుతోంది. అయితే డీప్‌ఫేక్ బెదిరింపుల కేసు, పార్టీ బహిష్కరణ నిర్ణయానికి నేరుగా సంబంధం ఉందని ఎంఐఎం అధికారికంగా ప్రకటించలేదు. 2023లో హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి మీర్జా రహ్మత్ బేగ్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2029 మే వరకు కొనసాగాల్సి ఉంది. అయితే పార్టీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ ఆదేశాల మేరకు మండలి చైర్మన్‌కు మీర్జా రహ్మత్ బేగ్ రాజీనామా సమర్పిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.ఇదిలా ఉండగా.. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు అనే తేడా లేకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇక రహ్మత్ బేగ్ ఇటీవల సౌదీ అరేబియాకు వెళ్లినట్లు.. అక్కడి నుంచి పార్టీ ఆదేశాల నేపథ్యంలో తిరిగి హైదరాబాద్‌కు వచ్చినట్లు పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఆయనను ఎందుకు అత్యవసరంగా హైదరాబాద్‌కు రప్పించారనే విషయంపై అధికారికంగా స్పష్టత లేదు. ఈ అంశంపై కూడా పార్టీ నుంచి పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.మొత్తంగా ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ బహిష్కరణ, ఆయనకు పార్టీ నుంచి వచ్చిన రాజీనామా ఆదేశాలు, మరోవైపు డీప్‌ఫేక్ వీడియోల పేరుతో వచ్చిన బెదిరింపులు ప్రస్తుతం హైదరాబాద్ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలో వైరల్ అవుతున్న ఆరోపణలను వాస్తవాలుగా పరిగణించకుండా.. పార్టీ అధికారిక ప్రకటనలు, పోలీసుల దర్యాప్తు ఆధారంగా మాత్రమే తదుపరి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# కవిత హరీష్ ను ఎందుకు టార్గెట్ అయ్యారు...



**హైదరాబాద్ ఆగస్టు 29, పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన అనే సరికొత్త వేదికను ఏర్పాటు చేసినప్పటి నుంచి కల్వకుంట్ల కవిత తన ప్రధాన రాజకీయ అస్త్రాన్ని హరీష్ రావు వైపే గురిపెట్టారు. సాధారణంగా ప్రతిపక్షాలు , పొలిటికల్ శత్రువులపై చేసే విమర్శలకు భిన్నంగా.. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించడానికి హరీష్ రావే కారణమని, ఆయన క్షుద్రపూజలు చేయిస్తున్నారంటూ ఆమె చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ సరిహద్దులను దాటేశాయి. చాలా కాలం కలసి పని చేసిన, పైగా సమీప బంధువు అయిన మాజీ మంత్రిపై కవిత ఇంతటి తీవ్రమైన పొలిటికల్ ఎటాక్‌కు దిగడం వెనుక ఒక సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందని భావిస్తున్నారు. కవిత ప్రధాన లక్ష్యం---బీఆర్ఎస్ గులాబీ శ్రేణుల్లోను, కేసీఆర్ కుటుంబంలోనూ హరీష్ రావుపై కోలుకోలేని స్థాయిలో అపనమ్మకాన్ని పెంచడమే. కవిత అరెస్టు కావడం, ఆ తర్వాత పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడం, చివరికి కేసీఆర్ ఆమెను పక్కన పెట్టేలా జరిగిన పరిణామాల వెనుక హరీష్ రావే సూత్రధారి అనే బలమైన నమ్మకం ఆమెలో ఉంది. అందుకే హరీష్‌ను పార్టీలో ఒంటరిని చేసి, ఆయన బిఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేలా వాతావరణం సృష్టించాలని అనుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. కవిత వ్యూహం కేవలం వ్యక్తిగత కోపం కాదు. బీఆర్ఎస్ క్యాడర్ , కేసీఆర్ ఆత్మీయుల దృష్టిలో హరీష్‌ను విశ్వాసఘాతకుడిగా ముద్ర వేయడం ద్వారా, పార్టీపై హరీష్ పట్టును సడలించాలనేది ఆమె వేసిన పక్కా ప్లాన్ అనుకోవచ్చు. టీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత క్షేత్రస్థాయిలో, క్యాడర్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నేత హరీష్ రావు. ఒకవేళ హరీష్ పార్టీ నుంచి నిష్క్రమిస్తే.. పార్టీపై, గులాబీ కేడర్‌పై కేసీఆర్ కుటుంబం ఆధిపత్యం తిరుగులేనిదిగా మారుతుంది. అయితే ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి కవిత దూరమయ్యారు. కేటీఆర్ దే ఆధిపత్యం అవుతుంది. అయితే కేటీఆర్ వద్ద అసలు నాయకత్వ లక్షణాల్లేవని కవిత అంటున్నారు. హరీష్ రావు గనక బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే, గులాబీ పార్టీ బలహీనపడుతుంది. అప్పుడు బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలకు, కేడర్‌కు కవిత పార్టీ ఒక ప్రధాన ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కు ఇప్పటికీ అత్యంత ఆప్తుడిగా, నమ్మకస్తుడిగా హరీష్ ఉండటాన్ని కవిత తట్టుకోలేకపోతున్నారు. హరీష్‌ను పార్టీకి దూరం చేయగలిగితే, మళ్లీ కేసీఆర్ మనసు గెలుచుకుని, అవసరమైతే భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను తన వేదికతో విలీనం చేసి రీ-ఎంట్రీ ఇవ్వవచ్చనే ఆలోచన కూడా ఆమెలో ఉండి ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే కవిత వేస్తున్న ఈ పావులు ఎంతవరకు పారుతాయనేది సందేహాస్పదమే. హరీష్ రావు దశాబ్దాలుగా గ్రౌండ్ లెవెల్ రాజకీయాలు చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో నిర్మించిన నాయకుడు. కవిత చేసే క్షుద్రపూజల ఆరోపణలను సామాన్య ప్రజలు లేదా తీవ్రస్థాయి గులాబీ కేడర్ ఎంతవరకు నమ్ముతారనేది ప్రశ్నార్థకం. పైగా కేటీఆర్ కూడా ప్రస్తుతానికి హరీష్‌తో కలిసే ప్రతిపక్ష పోరాటం చేస్తున్నారు. ఒకవేళ కవిత అనుకున్నట్లుగా హరీష్ రావుపై ఈ ఆరోపణలు పనిచేసి, ఆయన బీఆర్ఎస్‌కు దూరమైతే అది కవిత తెలంగాణ రక్షణ సేన కు రాజకీయంగా ఊపిరి పోస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఇది ఉమ్మడి మెదక్, వరంగల్ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీసి, కాంగ్రెస్ లేదా బీజేపీలకు మేలు చేసే ప్రమాదం కూడా ఉంది. ఏది ఏమైనా కవిత-హరీష్ మధ్య జరుగుతున్న ఈ సమరం తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో మరిన్ని ఊహించని మలుపులకు దారితీయనుంది.

## కీడాకారులకు, క్రీడాభిమానులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:**
జాతీయ క్రీడా దినోత్సవం' సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి క్రీడాకారులకు, క్రీడాభిమానులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.
హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్చంద్ గారి జయంతి సందర్భంగా, ఆయన స్ఫూర్తితో, ప్రతి క్రీడాకారుడు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధనతో విజయాన్ని అందుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.
క్రీడాకారులను ప్రోత్సహించి తద్వారా తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సమగ్ర స్పోర్ట్స్ పాలసీ, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు.

అత్యుత్తమ క్రీడా మౌలిక వసతులు, శిక్షణా సదుపాయాలను కల్పిస్తున్నామని గుర్తుచేస్తూ, తెలంగాణ గౌరవాన్ని, భారత కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వేదికలపై నిలబెట్టే క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని చెప్పారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# భూ మోసాలకు పాల్పడిన.. రౌడీషీటర్ మజార్ ఖాన్ అరెస్ట్..

## రూ.3 లక్షలు తీసుకుని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం..
## 9 కేసుల్లో మజార్ ఖాన్ నిందితుడిగా ఉన్నట్టు పోలీసులు వెల్లడి..

- **స్థలం విక్రయిస్తానని రూ.3 లక్షలు తీసుకున్న నిందితుడు మజార్ ఖాన్..**
- **80 గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితులు ఫిర్యాదు..**
- **కేసు నమోదు చేసి మజర్ ఖాన్‌ను అరెస్ట్ చేసిన సూరారం పోలీసులు..**
- **గతంలో 9 కేసులు.. బాలానగర్ పీఎస్‌లో రౌడీషీట్ నమోదైనట్లు వెల్లడి..**



రౌడీషీటర్ మజార్ ఖాన్..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 29:** స్థలం విక్రయిస్తానని నమ్మించి రూ.3 లక్షలు తీసుకుని, ఆతర్వాత స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు డబ్బులు తిరిగి ఇవ్వలేదన్న ఫిర్యాదుపై సూరారం పోలీసులు ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని అరెస్ట్ చేశారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్‌కు చెందిన మజర్ ఖాన్ (51), తండ్రి సలీం ఖాన్‌ను ఈ కేసులో నిందితుడిగా అరెస్ట్ చేసి న్యాయస్థానంఎదుట హాజరుపరిచారు. దీంతో న్యాయస్థానంఆయనకు రిమాండ్ విధించింది.. పూర్తి వివరాల్లోకి వెళ్ళితే.. 2019లో రూ.3 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదు..కైసర్‌నగర్‌కు చెందిన రామ తులసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూరారం పోలీసులు క్రైమ్ నం.621/2026 కింద బీఎన్ఎస్ 318(4) రెడ్‌విత్ 316(2) సెక్షన్లలో కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం.. 2019లో కైసర్‌నగర్‌లోని 80 చదరపు గజాల స్థలాన్ని విక్రయిస్తానని మజర్ ఖాన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థలం కొనుగోలు కోసం ఆయనకు రూ.3 లక్షలు నగదు చెల్లించినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు.. అయితే నగదు తీసుకున్న అనంతరం స్థలాన్ని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయలేదని, తీసుకున్న మొత్తాన్ని కూడా తిరిగి ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. స్థలం, డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినప్పటికీ స్పందించకపోవడంతో చివరకు సూరారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు..

### భూ మోసాలపై నిఘా..

సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో భూ కబ్జాలు, మోసాలు, అక్రమ భూ లావాదేవీలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. భూముల క్రయవిక్రయాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పత్రాలను పరిశీలించిన అనంతరం మాత్రమే లావాదేవీలు నిర్వహించాలని సూచించారు..

### రౌడీషీటర్ మజార్‌పై గతంలో 9కేసులు..

ఫిర్యాదు స్వీకరించిన సూరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో లభించిన సమాచారం ఆధారంగా మజర్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు..అరెస్టయిన మజర్ ఖాన్‌పై గతంలోనూ పలు భూ వివాదాలు, భూ మోసాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మియాపూర్, జీడిమెట్ల, సూరారం, దుండిగల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 9 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై రౌడీషీట్ కూడా నమోదై ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు..

# బంగారు గనిలా మారిన 'హైదరాబాద్ ఐటీ కారిడార్'



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ గుండెకాయ లాంటి హైదరాబాద్ మహానగరం ప్రపంచ పటంలో తన ప్రాభవాన్ని మరోసారి సగర్వంగా చాటుకుంది. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, వాణిజ్య కేంద్రంగా సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. నగరం వైపు ప్రపంచ దిగ్గజ సంస్థల చూపు నిలవడంతో.. ఇక్కడి రియల్ ఎస్టేట్ రంగం ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. ముఖ్యంగా నగర ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం ప్రాంతం వేలం పాటల్లో రోజుకో కొత్త మైలురాయిని అధిగమిస్తూ, పెట్టుబడులకు తిరుగులేని కేంద్రంగా నిలుస్తోంది.

**వారంలోనే రూ.5 కోట్లు పైకి.. గ్లోబల్ బ్రాండ్‌గా రాయదుర్గం**

తాజాగా తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఆన్‌లైన్ భూమి వేలంలో రాయదుర్గం విశ్వరూపం ప్రదర్శించింది. సర్వే నంబర్ 83/1 పరిధిలోని 5.38 ఎకరాల భూమికి ప్రభుత్వం ఎకరానికి రూ.175 కోట్ల ప్రారంభ ధరను నిర్ణయించగా.. పోటీపడ్డ సంస్థలు పోటీపడి బిడ్లు దాఖలు చేశాయి. తీవ్ర పోటీ మధ్య వంశీ రామ్ బిల్డర్స్ సంస్థ ఎకరానికి ఏకంగా రూ.269 కోట్లు చొప్పున బిడ్ దాఖలు చేసి భూమిని దక్కించుకుంది.
కేవలం ఒక వారం క్రితమే ఇదే ప్రాంతంలో ఎకరం రూ.264 కోట్లకు విక్రయమవ్వగా ఇప్పుడు మరో రూ.5 కోట్లు పెరిగి రూ.269 కోట్లకు చేరడం మార్కెట్ వర్గాలను విస్తుపోయేలా చేసింది. ఈ ఒక్క వేలం ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏకంగా రూ.1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది.

**రూ.300 కోట్ల దిశగా.. అపార అవకాశాల వేదిక**

గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి నాలెడ్జ్ హబ్‌లకు అత్యంత సమీపంలో ఉండటం.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండటంతో రాయదుర్గం బిజినెస్ ల్యాండ్‌మార్క్‌గా మారింది. బహుళజాతి కంపెనీలు, విలాసవంతమైన నిర్మాణాలకు ఈ ప్రాంతం ప్రాధాన్య గమ్యస్థానంగా మారింది. వేలంలో కనిపిస్తున్న ఈ అపూర్వమైన
ధరల పెరుగుదల రేసును చూస్తుంటే.. త్వరలోనే రాయదుర్గంలో ఎకరం ధర రూ.300 కోట్ల మైలురాయిని దాటినా ఆశ్చర్యపోనవసరం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ ఆత్మవిశ్వాసానికి, తిరుగులేని ఆర్థిక రంగానికి ఈ సరికొత్త రికార్డు ఒక నిలువెత్తు నిదర్శనం.

# కారు గేరు మార్పు...




**హైదరాబాద్, ఆగస్టు 29, పెన్ పవర్:**
తెలంగాణలో బీఆర్ఎస్ స్పీడ్ పెంచింది. ఎన్నికల సమయంతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లో ఉండేందుకు ప్రయత్నిస్తుంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత్ రాష్ట్ర సమితి అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై తన రాజకీయ పోరాట వేగాన్ని గణనీయంగా పెంచింది. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా కాంగ్రెస్ తన ఎన్నికల హామీలను నెరవేర్చలేదనే ప్రధాన అజెండాతో బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు తెలియజేసింది. ఏదో ఒక ఆందోళన చేస్తూ ప్రతి రోజూ ప్రభుత్వం పంటి కింద రాయిలా తయారయింది. జనం వాయిస్ ను రైజ్ అయ్యేలా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను నిర్వహిస్తుంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ప్రతి రోజూ ఏదో ఒక అంశంపై బీఆర్ఎస్ ఆందోళనకు దిగుతుంది. వరసగా బీఆర్ఎస్ చేస్తున్న ఆందోళనలతో కొంత ప్రభుత్వం ఇరకాటంలో పడినట్లయింది. భూ కబ్జాలు, 22 ఎ వివాదం, హైడ్రా కూల్చివేతలు, తాజాగా విద్యార్థుల పక్షాన పోరుబాట పట్టింది. పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా బీఆర్ఎస్ నిలబడింది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు నిత్యం జనంలోనే ఉంటున్నారు. తొలుత వెయ్యి రోజుల పాలనపై 'పోరుబాట'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ వైఫల్యాలపై అధికారికంగా ఛార్జ్‌షీట్ విడుదల చేయనున్నారు.కాంగ్రెస్ అమలు చేయని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు "బాకీ కార్డ్స్" ప్రచారాన్ని తిరిగి ప్రారంభించారు.వినూత్న నిరసనల షెడ్యూల్ లు రం రోజుల పాటు వివిధ వర్గాల సమస్యలపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రపంచపటాలు పరిశీలించండిసెప్టెంబర్ 3న వ్యవసాయం, రుణమాఫీ, ఉచిత విద్యుత్ సమస్యలపై రైతు సమావేశాలు నిర్వహిస్తుంది. సెప్టెంబర్ 4న మహిళా సమస్యలు, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించనుంది. సెప్టెంబర్ 5న రూ. 12,000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ క్యాలెండర్ ఆలస్యంపై భారీ ర్యాలీలు నిర్వహించనుంది. సెప్టెంబర్ 6న నగరంలో తాగునీరు, మౌలిక సదుపాయాల కొరతపై ఆటోలతో నిరసన తెలియజేయనుంది. సెప్టెంబర్ 7, 8 తేదీల్లో జిల్లా, మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాల సమర్పించనుంది. ముఖ్యంగా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన 22ఏ నిషేధిత జాబితా సమస్య వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై హరీష్ రావు న్యాయ విచారణ కోరుతూ సభను స్తంభింపజేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు.రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు మరియు వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను చైతన్యపరుస్తూ తన రాజకీయ వేగాన్ని అంచెలంచెలుగా పెంచుతోంది.

# కమలం వైపు కొండా చూపు



**హైదరాబాద్, ఆగస్టు 29, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయంలో దశాబ్దాలుగా తమకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించుకున్న కొండా సురేఖ – మురళి దంపతుల రాజకీయ ప్రస్థానం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో పార్టీ అధిష్ఠానానికి, స్థానిక ఎమ్మెల్యేలకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. సొంత పార్టీలోనే సొంత సహచరులు కొండాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తుండటంతో, వారి కాంగ్రెస్ ప్రయాణం దాదాపు క్లైమాక్స్‌కు చేరిందనే చర్చ జోరందుకుంది.గతంలో బీఆర్ఎస్ శ్రేణులతో తీవ్రస్థాయిలో శత్రుత్వం పెంచుకుని ఆ పార్టీని వీడి రావడం, కెటిఆర్ , బిఆర్ఎస్ అధినాయకత్వంపై తీవ్ర విమర్శలు చేయడంతో తిరిగి కేసీఆర్ గూటికి వెళ్లే తలుపులు పూర్తిగా మూసుకుపోయాయి. ఇక మిగిలిన ఒకే ఒక ప్రధాన జాతీయ ప్రత్యామ్నాయం బీజేపీ . ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవం, సొంత కేడర్ ఉన్న కొండా దంపతులకు ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో బీజేపీ వైపు చూడక తప్పని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌లో విమర్శల సెగ, బీఆర్ఎస్‌తో మూసుకుపోయిన తలుపులు.. ఇప్పుడు కొండా దంపతులకు మిగిలిన ఒకే ఒక ప్రధాన ద్వారం బీజేపీ! అయితే క్రమశిక్షణకు ప్రాధాన్యమిచ్చే కమలం పార్టీలో వీరి దూకుడు నైజంతో ఉండగలరా అన్నది కూడా అప్పుడే అందరికీ వస్తున్న సందేహం. మరోవైపు తెలంగాణలో బలమైన బీసీ నాయకత్వం కోసం శోధిస్తున్న బీజేపీకి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టున్న బిసి నేతలు అవసరం ఎంతైనా ఉంది. బలమైన బీసీ సామాజిక వర్గాలకు చెందిన కొండా జంటను చేర్చుకోవడం ద్వారా వరంగల్, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయవచ్చని బీజేపీ భావించే అవకాశం ఉంది. ఈ వ్యూహంలో భాగంగానే, ముందస్తుగా కుమార్తె సుస్మితను బీజేపీలోకి పంపి, ఆ తర్వాత శాసనసభ ఎన్నికల సమయానికి సురేఖ–మురళి దంపతులు నేరుగా కమలం గూటికి చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అయితే, అసలు సమస్యల్లా కొండా దంపతుల ఫైర్‌బ్రాండ్ పొలిటికల్ స్టైల్. కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, బీఆర్ఎస్ వంటి ప్రాంతీయ, ప్రజాస్వామ్య వాతావరణం ఉన్న పార్టీలలో వారు చూపించిన స్వతంత్ర వైఖరి, దూకుడు రాజకీయం బీజేపీ కల్చర్‌కు పూర్తిగా భిన్నమైనవి. బీజేపీ అనేది కేంద్ర నాయకత్వం, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు, ఖచ్చితమైన పార్టీ క్రమశిక్షణ ఆధారంగా నడిచే సంస్థ. పార్టీ గీత దాటి మాట్లాడితే ఎంతటి నేతలనైనా పక్కన పెట్టే నైజం బీజేపీది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో సొంత సీఎంపైనే తిరుగుబాటు బావుటా ఎగరేసినట్లుగా ముద్రపడిన కొండా దంపతులు, బీజేపీలోని విధివిధానాలకు అలవాటు పడి ఇమడగలరా అన్నది పెద్ద ప్రశ్నార్థకం. వరంగల్ జిల్లా బీజేపీలో ఇప్పటికే ఉన్న స్థానిక నేతలతో కొండా దంపతులకు ఆధిపత్య పోరు తప్పకపోవచ్చు. ఏది ఏమైనా, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి బీజేపీ లోకి అడుగుపెట్టడం ఒక ఎత్తయితే, అక్కడి కట్టుబాట్లను తట్టుకుని నిలబడటం కొండా దంపతులకు అతిపెద్ద సవాలుగా మారనుంది..

**జనసేనలోకి సుస్మిత**


రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మితతో పాటు రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి వంటి నేతలు సొంత పార్టీపై విమర్శలు చేశారు. తాజాగా.. రాష్ట్ర రాజకీయాల్లో మరో ఆసక్తికర ప్రచారం తెరపైకి వచ్చింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత త్వరలో జనసేన పార్టీలో చేరబోతున్నారంటూ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న అంతర్గత పరిణామాలు, పరకాల రాజకీయాల నేపథ్యంలో ఆమె జనసేన వైపు అడుగులు వేస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. అయితే ఈ ప్రచారాన్ని సుస్మితగానీ, జనసేనగానీ ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు.కొండా కుటుంబానికి కాంగ్రెస్ నేతలతో పొసగటం లేదు. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న సుస్మిత ఆకాంక్ష ఈ పరిణామాలకు కేంద్రంగా మారినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో పరకాల టికెట్ తనకు దక్కాలని ఆమె కోరుకుంటున్నారు. తానే అక్కడి నుంచి పోటీ చేస్తానని.. పార్టీ నుంచి అవకాశం రాకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఇప్పటికే ప్రకటించారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో వివాదానికి దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. దీనిపై మంత్రి సురేఖ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వివరణ ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.తాజాగా ఈ పరిణామాలకు జనసేన అంశం కూడా జత కావడంతో ఆసక్తి మరింత పెరిగింది. తెలంగాణలో తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునే దిశగా జనసేన క్రమంగా కార్యాచరణను విస్తరిస్తోంది. ముఖ్యంగా యువత, కొత్త రాజకీయ శక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న వ్యూహంలో భాగంగా పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే సుస్మితతో జనసేన నేతలు చర్చలు జరుపుతున్నారనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఇటీవల వైద్యారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన ప్రకటించడం కూడా తెలంగాణలో పార్టీ విస్తరణపై చర్చకు దారితీసింది.

# ముందుకు సాగని కొండగట్టు అభివృద్ధి పనులు

**కరీంనగర్, ఆగస్టు 29, పెన్ పవర్:** కొండగట్టు ఆలయ అభివృద్ధి పనులపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణం కోసం టీటీడీ నిధులు సిద్ధంగా ఉన్నాయని, జనవరి 3న శంకుస్థాపన కూడా పూర్తయిందని పేర్కొంది. అయినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై జనసేన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. టెండర్ ప్రక్రియలో జాప్యానికి కారణం ఏంటో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై విమర్శలు గుప్పించింది.తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనుల జాప్యంపై జనసేన పార్టీ ప్రశ్నలు సంధించింది. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసింది. కొండగట్టు భక్తుల సౌకర్యాల కోసం మంజూరైన నిధులను వినియోగించి అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసింది. కొండగట్టు ఆలయంలో 96 గదుల సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణం కోసం రూ.35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు సిద్ధంగా ఉన్నాయని జనసేన పేర్కొంది.కొండగట్టు ఆలయ అభివృద్ధి పనులకు జనవరి 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అక్కడ పర్యటించి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేసింది. అయితే శంకుస్థాపన పూర్తి అయి నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు టెండర్ ప్రక్రియ ఎందుకు చేపట్టలేదో రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరింది.కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రతిపాదించిన నిర్మాణాలను ఆలస్యం చేయడం సరికాదని జనసేన పార్టీ అభిప్రాయపడింది. రూ.35.19 కోట్ల టీటీడీ నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ టెండర్ ప్రక్రియ ఎందుకు ముందుకు సాగడం లేదంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హిందూ భక్తుల సౌకర్యాలకు సంబంధించిన అభివృద్ధి పనులను రాజకీయ అంశంగా మార్చకుండా వెంటనే ప్రారంభించాలని జనసేన డిమాండ్ చేసింది. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కోరింది. ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎందుకు స్పందించడం లేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. కొండగట్టు అభివృద్ధి పనులపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్, పొన్నం ప్రభాకర్ మధ్య గతంలో చోటుచేసుకున్న రాజకీయ మాటల యుద్ధం నేపథ్యంలో తాజా విమర్శలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ సభకు అనుమతి విషయంలో ఇరువురి మధ్య మాటల తూటాలు పేలాయి. అప్పటి నుంచి జనసేన పార్టీ, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.

## జిల్లా సమితి సభ్యుడిగా గోపి ఎన్నిక

**ఖమ్మం, పెన్ పవర్, ఆగస్టు 29:**
ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ 28వ వార్డుకు చెందిన సీపీఐ సోషల్ మీడియా ఇంచార్జి రెబ్బగొండ్ల గోపికి యువజన రాజకీయాల్లో కీలక బాధ్యత దక్కింది. శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశంలో గోపిని జిల్లా సమితి సభ్యుడిగా నూతనంగా ఎన్నుకున్నారు.యువజన సమస్యలపై చురుగ్గా స్పందిస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న గోపికి జిల్లా స్థాయి బాధ్యత అప్పగించడం పట్ల సీపీఐ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా యువతను సమీకరించడంతో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో గోపి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ బాధ్యత లభించిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా రెబ్బగొండ్ల గోపి మాట్లాడుతూ, యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. యువత హక్కుల సాధన కోసం అఖిల భారత యువజన సమాఖ్యను మరింత బలోపేతం చేసి, పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు.జిల్లా సమితి సభ్యుడిగా తనకు బాధ్యత అప్పగించిన నాయకత్వానికి గోపి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ, యువజన సమాఖ్య బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానన్నారు.గోపి ఎన్నికతో 28వ వార్డులో సీపీఐ యువజన రాజకీయాలకు మరింత ఊపు లభించనుందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. జిల్లా సమితిలో లభించిన కొత్త బాధ్యతతో యువతను మరింతగా సంఘటితం చేసి, ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. జిల్లా సమితి సభ్యుడిగా ఎన్నికైన గోపికి పలువురు సీపీఐ నాయకులు, యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



జిల్లా సమితి సభ్యుడు గోపి

## ప్రైమ్ ల్యాండ్ లో అమ్మకాలకు ప్లాన్

**హైదరాబాద్, ఆగస్టు 29, పెన్ పవర్:**
రాయదుర్గంలో నిర్వహించిన భూముల ఇ–వేలంలో ఎకరం ఏకంగా రూ. 264 కోట్ల ఆల్–టైమ్ రికార్డు ధర పలకడంతో ఊపుమీదున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మరోసారి నగర పరిధిలోని ప్రైమ్ ల్యాండ్ పార్సెళ్లు, రెసిడెన్షియల్ లేఅవుట్లను వేలానికి ఉంచేందుకు సర్వం సిద్ధం చేసింది. ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా భారీగా ఆదాయం సమీకరించడంతో పాటు, పారదర్శకమైన టైటిళ్లతో డెవలపర్లు, కొనుగోలుదారులకు ల్యాండ్ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నోటిఫికేషన్లు జారీ చేసింది.ఐటీ, ఫైనాన్షియల్ కారిడార్‌లో హాట్ కేకులా మారిన కోకాపేట్‌లోని నియోపోలిస్ ప్లాట్ నెం. 17 -- 4.59 ఎకరాలు ల్యాండ్ పార్సెల్‌కు సంబంధించి రీ–ఆక్షన్ నిర్వహించేందుకు హెచ్ఎండీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి కనీస ప్రారంభ ధర గా ఎకరానికి రూ. 120 కోట్లు నిర్ణయించడంతో రియల్ ఎస్టేట్ దిగ్గజాల దృష్టి అంతా మళ్లీ కోకాపేట్‌పైనే పడింది. దీనితో పాటు గోల్డెన్ మైల్‌లోని 0.70 ఎకరాల స్థలాన్ని ఎకరానికి రూ. 70 కోట్ల అప్‌సెట్ ధర కూడా సెప్టెంబర్ 9న ఇ–వేలం వేసేందుకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.మరోవైపు నగరంలో సొంతింటి స్థలం కొనుక్కోవాలనుకునే వారిని దృష్టిలో ఉంచుకుని పశ్చిమ, ఉత్తర ప్రాంతాల్లోని వ్యూహాత్మక లేఅవుట్లను వేలానికి తీసుకొచ్చారు. పశ్చిమ కారిడార్‌లోని మోకిల లేఅవుట్‌లో చదరపు గజానికి రూ. 55,000 అప్‌సెట్ ధరగా నిర్ణయించగా, ఐటీ కారిడార్‌కు అతిసమీపంలో ఉన్న బాచుపల్లి లేఅవుట్‌లో చదరపు గజానికి రూ. 45,000 కనీస ధరగా ఖరారు చేశారు. అలాగే అవుటర్ రింగ్ రోడ్ కనెక్టివిటీ ఉన్న ఇన్ముల్ సర్వ గ్రామంలో చదరపు గజానికి రూ. 15,000గా ధర నిర్ణయించారు.ఈ భారీ భూముల అమ్మకాల ప్రక్రియ మొత్తం ఈ–కామర్స్ పోర్టల్ ద్వారా అత్యంత పారదర్శకంగా సాగనుంది. ఈ నెల ఆగస్టు 31తో రిజిస్ట్రేషన్లు , ఈఎమ్‌డీ సమర్పణ గడువు ముగియనుండగా, సెప్టెంబర్ 2న మోకిలా, బాచుపల్లి లేఅవుట్ల వేలం జరగనుంది. సెప్టెంబర్ 3న ఇన్ముల్ నర్వ, సెప్టెంబర్ 9న కోకాపేట్ నియోపోలిస్ బిడ్డింగ్ సాగనుంది. 100% వివాద రహిత ప్రభుత్వ భూములు కావడం, 100 అడుగుల రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కరెంట్ వసతులతో హెచ్ఎండీఏ వీటిని సిద్ధం చేయడంతో ఈసారి కూడా వేలంలో సరికొత్త రికార్డులు నమోదు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

**యూనిట్ మాల్ నిర్మాణం**

తెలంగాణలోని కుటీర పరిశ్రమలు, చేనేత, హస్తకళలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని రాయదుర్గంలో యూనిటీ మాల్ నిర్మాణంచేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద మంజూరైన నిధులతో ఒక జిల్లా--ఒక ఉత్పత్తి కాన్సెప్ట్‌తో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధిలోని రాయదుర్గంలో టీజీ లిప్కోకు చెందిన 6.12 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం బదలాయించింది. సుమారు 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు భారీ ట్విన్ టవర్లను నిర్మించేందుకు రూ.2,059.81 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఈ ప్రాజెక్టుకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది.రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన ప్రత్యేక ఉత్పత్తులతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంప్రదాయ వస్త్రాలు, హస్తకళలు, వ్యవసాయ ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. యూనిటీ మాల్ నిర్మాణాన్ని పబ్లిక్--ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో చేపడుతున్నారు. లావాదేవీల సలహాదారు జేఎల్ఎల్ నేతృత్వంలో టెండర్ల ప్రక్రియ పూర్తికాగా.. వంశీరామ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ లీడ్ మెంబర్‌గా, అపర్ణ ఇన్‌ఫ్రా--హౌసింగ్ సభ్యునిగా ఉన్న కన్సార్టియం ప్రాజెక్టును దక్కించుకుంది. ప్రభుత్వం లెటర్ ఆఫ్ అవార్డు జారీ చేసింది. ఈ సంస్థలు యూనిటీ మాల్ అండ్ స్పేసెస్ ఎల్ఎల్‌పీ పేరుతో ఎస్పీవీ ఏర్పాటు చేసి జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ప్రక్రియను చేపడుతున్నాయికేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టుకు రూ.202 కోట్లు మంజూరు చేయగా.. తొలి విడతగా రూ.101 కోట్లు విడుదల చేసింది. ఇందులో రూ.60 కోట్లు జీహెచ్ఎంసీ భవన నిర్మాణ అనుమతుల ఫీజులకు చెల్లించారు. ఇప్పటివరకు మొత్తం రూ.83.24 కోట్లు ఖర్చు చేశారు. వినియోగ ధ్రువపత్రాలు సమర్పిస్తూ రెండో విడత రూ.101 కోట్లు విడుదల చేయాలని టీజీటీపీసీ కేంద్రాన్ని కోరింది. ప్రాజెక్టును 2030 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మాల్‌లో 33 జిల్లాల ఉత్పత్తులకు ప్రత్యేక విక్రయ కేంద్రాలతోపాటు స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. చేనేత, జౌళి, గిరిజన హస్తకళలు, సహజ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక స్థలాలు కేటాయించనున్నారు. ప్రపంచస్థాయి ఎగ్జిబిషన్ గ్యాలరీలు, అంతర్జాతీయ సదస్సులకు మల్టీపర్పస్ కాన్ఫరెన్స్ హాళ్లు, కొనుగోలుదారులు, విక్రేతల కోసం బిజినెస్ లాంజ్‌లు, ఫుడ్‌కోర్టులు, ఆధునిక లాజిస్టిక్స్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.జీఐ గుర్తింపు పొందిన తెలంగాణ ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌ను విస్తరించడంతోపాటు మాల్ నిర్వహణ, విక్రయాలు, భద్రత, లాజిస్టిక్స్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.యూనిటీ మాల్ కేవలం వాణిజ్య సముదాయంగా కాకుండా గ్రామీణ ఉత్పత్తిదారులను గ్లోబల్ మార్కెట్‌తో అనుసంధానించే ఆర్థిక వేదికగా మారనుందని అంటున్నారు.

## బహిష్కృత ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ ముందే వార్నింగ్ ఇచ్చాం: ఓవైసీ

**హైదరాబాద్, ఆగస్టు 29, పెన్ పవర్:**
ఎంఐఎం బహిష్కృత ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ ను ఉద్దేశిస్తూ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యాలు చేసారు. మూడు రోజుల ముందే వార్నింగ్ ఇచ్చారు. మీర్జా రహ్మత్ బేగ్కు ఒక ఛాన్స్ ఉంది.. కూర్చొని మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించకుంటే మంచిది. లేదంటే పార్టీలో నుంచి బహిష్కరిస్తాం.. ఆ తర్వాత నన్ను ఇలా తొలగించారు అంటే కుదరదని అయన అన్నారు.2023లో ఎమ్మెల్సీగా ఎన్నికైన రహ్మత్ బేగ్ పదవీకాలం 2029 మే వరకు ఉన్నప్పటికీ.. పార్టీ నిర్ణయంతో రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడుతూ మీర్జా రహ్మత్ బేగ్ పట్టుబడ్డారంటూ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ సయ్యద్ సబ్దర్ అలీ తీవ్ర ఆరోపణలు చేశారు.అత్తాపూర్‌లో కొందరు యువకులు ఆయనను పట్టుకుని కొట్టి, వీడియోలు తీశారన్నారు.ఈ విషయం ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి ముందే తెలుసని, అయినా రహ్మత్ బేగ్‌ను ఉమ్రాకు పంపించారని సబ్దర్ అలీ ఆరోపించారు.వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇప్పుడు ఎలాంటి కారణం చెప్పకుండా సస్పెండ్ చేశారని ఆయన విమర్శించారు.

# ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌పై ఎంఐఎం వేటు.. రాజీనామాకు ఆదేశం.. అసలు కారణమిదేనా?



తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం సంచలన నిర్ణయం తీసుకుంది. బహిష్కరణతో పాటు తన ఎమ్మెల్సీ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేసి.. ఆ లేఖను శాసనమండలి చైర్మన్‌కు సమర్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎంఐఎం సంయుక్త కార్యదర్శి ఎస్.ఏ. హుస్సేన్ అన్వర్ పేరుతో ప్రకటన విడుదలైనట్లు సమాచారం.

**వివాదాలు, వైరల్ వీడియోల చుట్టూ రాజకీయాలు**

ఈ సంచలన నిర్ణయానికి ప్రధాన కారణాలు ఏమిటనే దానిపై హైదరాబాద్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. ఇటీవల సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించినవిగా ప్రచారంలోకి వచ్చిన కొన్ని వివాదాస్పద వీడియోలు, వాట్సాప్ చాట్‌లు, మరికొన్ని తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలోనే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుందనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. అయితే ఈ ఆరోపణలపై ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదని.. ఇవన్నీ సోషల్ మీడియా వ్యాఖ్యల ఆధారంగా ఉన్నాయని ఆయన వర్గీయులు అంటున్నారు.

**డీప్‌ఫేక్, సైబర్ క్రైమ్ కేసుల కలకలం**

ఈ వ్యవహారం వెలుగులోకి రావడానికి ముందే మీర్జా రహ్మత్ బేగ్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడం గమనార్హం. కొందరు వ్యక్తులు తనను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను సృష్టించి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. సదరు వీడియోలను నెట్‌లో పెడతామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆయన పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు పాతబస్తీకి చెందిన ఓ జర్నలిస్ట్ అత్తాపూర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యవహారంలో చేసిన ఆరోపణలు కూడా వైరల్ అయ్యాయి. అత్తాపూర్‌లో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడుతుండగా మీర్జా పట్టుబడ్డారని ఈ ఓల్డ్ సిటీ జర్నలిస్టు ఆరోపించారు. కొందరు యువకులు ఆయనను కొట్టి, వీడియోలు తీశారన్నారు. కాగా అవి డీప్ ఫేక్ వీడియోలంటూ మొన్న ఎమ్మెల్సీ పోలీసులకు కంప్లైంట్ చేశారు. అయితే వైరల్ అవుతున్న కంటెంట్ అసలైనదా లేక డీప్‌ఫేక్ సాంకేతికతతో సృష్టించినదా అన్నది పోలీసుల దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.

**పార్టీ కఠిన వైఖరి.. భవిష్యత్తు పరిణామాలు**

పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని, ప్రతినిధులు ఎవరైనా సరే చట్టానికి, పార్టీ నియమావళికి కట్టుబడి ఉండాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ గతంలో పలుమార్లు స్పష్టం చేశారు. ఆ సూత్రానికే కట్టుబడి అధిష్ఠానం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. 2023లో హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన రహ్మత్ బేగ్ పదవీకాలం 2029 మే వరకు ఉంది. ఇంకా సుదీర్ఘ కాలం మిగిలి ఉన్నప్పటికీ, పార్టీ ఆదేశాల ప్రకారం ఆయన రాజీనామా చేస్తారా లేక చట్టపరమైన, రాజకీయపరమైన ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటారా అనేది వేచి చూడాలి. ప్రస్తుతం ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# మన పెళ్లిళ్లు అంటే అట్లుంటది మరీ.. ఫ్రెండ్ పెళ్లికి వచ్చి.. తమ వివాహం చేసుకున్నారు..




సంస్కృతి అంటే కేవలం కొన్ని ఆచారాల సమాహారం మాత్రమే కాదు.. అది రెండు మనసులను కలిపే ఒక అమృత బంధం. మన భారతీయ వివాహ వ్యవస్థలో ఉండే ప్రాశస్త్యం, ఆ మంత్రాల శక్తి, ఆచారాలలో దాగి ఉన్న అంతరార్థం ఎల్లలు దాటి అంతర్జాతీయ మనసులను సైతం పరవశింపజేస్తుంటాయి. సరిగ్గా అలాంటి ఒక అద్భుతమైన, హృదయాన్ని హత్తుకునే సంఘటన తాజాగా సాగరతీరం విశాఖపట్నంలో ఆవిష్కృతమైంది. కొన్ని నెలల క్రితం విశాఖపట్నానికి చెందిన రణసూర్య--సృజనల వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి ఆస్ట్రేలియా నుంచి వారి ఆప్తమిత్రులు బ్రాడీ, ఎమిలీ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. కేవలం ఒక స్నేహితుడి పెళ్లికి హాజరై శుభాకాంక్షలు చెప్పడానికే వచ్చిన ఆ జంటకు.. ఇక్కడ కనిపించిన దృశ్యాలు ఒక కొత్త లోకాన్ని పరిచయం చేశాయి. మంగళ వాయిద్యాల దివ్య నాదాలు, అంబరాన్ని తాకే వేద మంత్రోచ్ఛారణలు, బంధుమిత్రుల ఆత్మీయ ఆలింగనాలు, పెద్దల పవిత్ర ఆశీర్వాదాలు.. వీటన్నింటినీ చూసి ఆస్ట్రేలియా జంట మెలికలు తిరిగే పరవశానికి లోనైంది. అగ్నిసాక్షిగా ఒకరిచేయి ఒకరు పట్టుకుని నడిచే ప్రతి అడుగు వెనుక ఉన్న అర్థాన్ని తెలుసుకుని వారి హృదయాలు ఉప్పొంగిపోయాయి. పాశ్చాత్య సంస్కృతిలో పెరిగిన ఆ జంటకు, మన హిందూ వివాహ పద్ధతిలో ఉన్న పవిత్రత, బంధాల గాఢత స్పష్టంగా అర్థమైంది. "మనం కూడా ఇలాగే ఇదే పవిత్రమైన పద్ధతిలో ఒక్కటికావాలి" అని ఆ క్షణంలోనే వారి మనస్సులు నిర్ణయించుకున్నాయి.

అనుకున్నదే తడవుగా తమ నిశ్చయాన్ని ఆచరణలో పెట్టారు. విశాఖపట్నంలోనే హిందూ సంప్రదాయాల ప్రకారం బ్రాడీ, ఎమిలీల వివాహం కన్నుల పండువగా జరిగింది. పట్టు వస్త్రాలు ధరించి, సంప్రదాయబద్ధంగా సిద్ధమైన ఆ జంటను చూసి ఆహూతులు మురిసిపోయారు. వేద మంత్రాల సాక్షిగా ఎమిలీ మెడలో బ్రాడీ తాళి కడుతున్నప్పుడు అగ్నిహోత్రం చుట్టూ ఆ ఇద్దరూ ఏడడుగులు వేస్తూ ఒక్కటవుతున్నప్పుడు అక్కడ ఉన్నవారందరి కళ్లు ఆనంద బాష్పాలతో నిండిపోయాయి.సప్తపది పూర్తి చేసుకుని, పెద్దల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంటున్న ఆ విదేశీ జంటను చూస్తుంటే.. భారతీయుల ఆత్మబంధం దేశ సరిహద్దులను చెరిపేసిందనే భావన కలిగింది. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ వేసిన ఆ ఏడడుగులు వారి ప్రేమకథలో అత్యంత ప్రాముఖ్యమైన ఘట్టంగా నిలిచిపోయాయి.

నేడు సోషల్ మీడియాలో ఈ అపూర్వ వివాహ చిత్రాలు వైరల్ అవుతుంటే నెటిజన్లు ఆస్ట్రేలియా జంటను మనస్ఫూర్తిగా దీవిస్తున్నారు. భాష వేరైనా, దేశం వేరైనా.. మన భావోద్వేగాలు, మన సంస్కృతి ఎంతటి గొప్పవో ఈ ఘటన మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. భారతీయ సంప్రదాయంపై అమితమైన గౌరవాన్ని చూపిస్తూ, దాన్ని తమ జీవితంలోకి ఆహ్వానించిన బ్రాడీ-ఎమిలీల కొత్త ప్రయాణం సదా సంతోషకరంగా సాగాలని కోరుకుందాం.

# ఎవరూ 'ఫెయిల్' అవ్వరు.. అందరూ పాస్ కాలేరు.. బిహార్ విద్యాశాఖ వినూత్న నిర్ణయం



విద్యార్థులకు పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తే వారి జీవితం ముగిసిపోయినట్లేనా? సమాజంలో వారు ఓడిపోయినట్లు ముద్ర వేయించుకోవాల్సిందేనా? దశాబ్దాలుగా మన విద్యా వ్యవస్థలో పాతుకుపోయిన ఈ సంప్రదాయ ఆలోచనా ధోరణికి బిహార్ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (దీూజుదీ) స్వస్తి పలికింది. పది, ప్లస్ టు మార్కుషీట్లలో 'ఫెయిల్' అనే పదాన్ని పూర్తిగా తొలగిస్తూ, ఆ స్థానంలో 'స్కిల్ ట్రైనింగ్‌కు అర్హత' అనే పదాన్ని చేర్చాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం విద్యావ్యవస్థ పెను మార్పులు తీసుకువస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. పోటీ ప్రపంచంలో వేగాన్ని అందుకోలేని వారు వృత్తి విద్యాకోర్సులతో కూడా మెరుగైన జీవనం గడపొచ్చని ప్రోత్సహించేలా బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపయోగపడుతుందని అంటున్నారు.

**ఓటమి భావన నుంచి ఆత్మవిశ్వాసం వైపు...**

పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోతే విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. కొందరైతే డిప్రెషన్‌లోకి వెళ్లి తీవ్ర నిర్ణయాలు తీసుకునే దుస్థితిని కూడా చూస్తున్నాం. దీనికి ప్రధాన కారణం 'ఫెయిల్' అనే ఒకే ఒక్క ముద్ర వేసి సమాజం చిన్నచూపు చూడటమే అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఫెయిల్ అన్న పదం విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి, భవిష్యత్తుపై నూతన ఆశలు లేకుండా చేస్తుందని అంటున్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించిన బిహార్ బోర్డు, విద్యార్థులను కుంగదీసే ఈ పద్ధతికి స్వస్తి పలకాలని నిర్ణయం తీసుకుంది. ఫెయిల్ అనే పదానికి బదులుగా వారు స్కిల్ ట్రైనింగ్‌కు అర్హులని పేర్కొనడం ద్వారా వారిలో నూతన ఉత్సాహాన్ని నింపాలని భావించిందని చెబుతున్నారు. మార్కుషీట్లలో 'ఫెయిల్' అని ముద్రించడం వల్ల విద్యార్థులు కుంగిపోకుండా, వారిని వృత్తి నైపుణ్య శిక్షణ వైపు మళ్లించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశంగా వ్యాఖ్యానిస్తున్నారు.

**స్వయం ఉపాధి వైపు విప్లవాత్మక అడుగు**

కేవలం మార్కులు, డిగ్రీల చుట్టూ తిరిగే విద్యా విధానం వల్ల నిరుద్యోగ సమస్య పెరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. అందరూ సాంప్రదాయ చదువులవైపే పరుగులు తీయలేరని, కొందరిలో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, వృత్తిగత ప్రతిభ మెండుగా ఉంటాయని చెబుతున్నారు. బిహార్ బోర్డు తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థులను కేవలం పరీక్షల పరంగానే కాకుండా, వాస్తవ ప్రపంచంలో ఉపాధి పొందేలా చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందని అభిప్రాయపడుతున్నారు. పరీక్షలో మార్కులు తక్కువొచ్చినంత మాత్రాన వారు పనికిరానివారు కారనీ, వారిని వివిధ రంగాల్లో నైపుణ్యం గల నిపుణులుగా తీర్చిదిద్దవచ్చనే స్పష్టమైన సందేశాన్ని ఈ విధానం ఇస్తోందని అంటున్నారు.

**భారతీయ విద్యా రంగంలో కొత్త మార్పులకు దిక్సూచి**

ఈ వినూత్న సంస్కరణ కేవలం బిహార్ రాష్ట్రానికే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఒక రోల్‌మాడల్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ప్రస్తుత జాతీయ విద్యా విధానం (చీజూ) కూడా వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అంటున్నారు. ఈ నేపథ్యంలో బిహార్ బోర్డు అమలు చేస్తున్న ఈ విధానం ఆదర్శప్రాయమని కొనియాడుతున్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, వారిని దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడానికి ఇలాంటి మార్పులు దేశవ్యాప్తంగా అవసరమని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, అందరూ ఒకేలా రాణించలేకపోవచ్చు అనే అభిప్రాయానికి బిహార్ బోర్డు తీసుకున్న నిర్ణయం అధిక ప్రాధాన్యమిచ్చిందని చెబుతున్నారు. ఈ నిర్ణయం వల్ల విద్యార్థుల్లో ఆత్మన్యూనతా భావం పోతుందని విశ్లేషిస్తున్నారు.

# మంత్రి సాకుతో కోర్టుకు ఎగనామం.. దళపతి ప్రభుత్వంలో నేతకు హైకోర్టు అక్షింతలు




చట్టానికి అంతా సమానమే.. మన భారత రాజ్యాంగం ప్రకారం ఎవరూ చట్టానికి అతీతులు కాదు. చివరికి చట్టాలు చేసే చట్టసభ సభ్యులు, మంత్రులు, ముఖ్యమంత్రి, ప్రధానిమంత్రి పదవులలో ఉన్న ఎవరైనా సరే.. చట్టం ముందు సమానమే. అధికారంలో ఉన్నంత మాత్రాన ఎవరికీ ప్రత్యేక మినహాయింపులు ఉండవు. మద్రాస్ హైకోర్టు తాజాగా ఈ అంశాన్ని మరోమారు స్పష్టం చేసింది. తాను మంత్రి పదవిలో ఉన్నందున కోర్టు విచారణకు రాలేనని, మినహాయింపు ఇవ్వాలని తమిళనాడు ఆర్థిక మంత్రి మరియా విల్సన్ చేసిన విజ్ఞప్తిపై తీవ్రంగా స్పందించింది. చట్టం ముందు ఎవరైనా సమానమేనని స్పష్టం చేస్తూ చీవాట్లు పెట్టింది.తమిళనాడు ఆర్థిక మంత్రి మరియా విల్సన్ పై 2022లో పుదుచ్చేరి పోలీసులు నమోదు చేసిన కేసుపై తాజాగా విచారణ జరిగింది. అయితే తాను మంత్రిగా ఉన్నందున కోర్టుకు రాలేనంటూ మరియా విల్సన్ అఫిడవిట్ వేయగా, హైకోర్టు తీవ్రంగా స్పందించింది. 'మీరేమి ఇంగ్లండ్ కు రాజు కాదు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అంతటి వారే న్యాయస్థానం ఎదుట విచారణకు హాజరయ్యారు. అంతకంటే మీరేమీ గొప్పవారు కాదు, మంత్రులకు ప్రత్యేక చట్టాలు ఉండవు. విచారణకు హాజరుకావాల్సిందేనని స్పష్టం చేస్తూ జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ తీర్పు వెలువరించారు. 2022లో పుదుచ్చేరిలోని తన సోదరుడు, మరదలిపై దాడికి సంబంధించి విల్సన్ పై లాస్ పేట పోలీసులు కేసు నమదు చేశారు. పుదుచ్చేరి క్రిమినల్ కోర్టులో విచారణ జరుగుతుండగా, ఈ కేసును కొట్టివేయాలంటూ ఆయన మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై శుక్రవారం ఉదయం విచారణ జరిగింది. మరియా విల్సన్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ శాసనసభ సమావేశాల కారణంగా బిజీగా ఉండటంతో దిగువ కోర్టుకు హాజరుకాలేకపోతున్నారని, అందువల్ల హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యత గల మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి కోర్టుకు హాజరుకాకపోవడం గర్హనీయమని వ్యాఖ్యానించింది. గతంలో నిత్యం కోర్టుకు వచ్చిన విల్సన్ మంత్రి పదవి చేపట్టిన తర్వాత గైర్హాజరు అవడాన్ని కోర్టు గుర్తు చేసింది. ఇదే సమయంలో పుదుచ్చేరి పోలీసుల తరపు న్యాయవాది జోక్యం చేసుకుని మంత్రి బిజీగా ఉంటే వేలాంకణి ఉత్సవాలకు ఎలా వెళ్ల గలుగుతున్నారని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ధర్మాసనం స్పందిస్తూ మంత్రి దిగువ కోర్టులో ఎప్పుడు హాజరవుతారో తెలుసుకుని చెప్పాలని న్యాయవాదిని ఆదేశిస్తూ కేసును వాయిదా వేసింది. కాగా, మంత్రి సెప్టెంబరు 9న విచారణకు హాజరు అవుతారని, అదే సమయంలో కేసును కొట్టివేయాలంటూ తాము దాఖలు చేసిన పిటిషన్ ను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని న్యాయవాది కోరగా, కోర్టు సానుకూలంగా స్పందించింది.

కాగా, మంత్రి మరియా విల్సన్ ను ఉద్దేశించి మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. మంత్రి విల్సన్ కేసులో విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ దేశంలో చాలా మంది నాయకులకు ఈ మాటలు వర్తిస్తాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాల్లో ఉన్నంత మాత్రాన చట్టం, న్యాయం వేరుగా ఉంటాయని భావిస్తే పొరపాటుని కోర్టు వ్యాఖ్యలు రుజువు చేశాయని అంటున్నారు.

# నేపాల్ ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ కీలక అధికారి అదృశ్యం.. విస్తృత గాలింపు

నేపాల్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు తీవ్ర వినాశనాన్ని సృష్టించాయి. ఈ ప్రకృతి విపత్తులో వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గల్లంతయ్యారు. ఈ క్రమంలో ప్రముఖ భారతీయ ఐటీ దిగ్గజం 'ఇన్ఫోసిస్' కీలక అధికారి ఒకరు వరదల ధాటికి ఆచూకీ లేకుండా పోవడం ఐటీ వర్గాల్లోనూ, సదరు సంస్థలోనూ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ అధ్యక్షుడు, సీఈఓ ల్యాక్స్ గోపిశెట్టి నేపాల్‌లో వరదల ప్రభావిత ప్రాంతంలో ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వ్యక్తిగత పర్యటనలో భాగంగా ఆయన నేపాల్‌కు వెళ్లినట్లు సమాచారం. అయితే భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించిన తర్వాత ఆయనను సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు, సహచరుల్లో ఆందోళన నెలకొంది.గోపిశెట్టి భద్రత, ఆరోగ్యమే తమకు అత్యంత ప్రాధాన్యమని ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఆయన ఎక్కడ ఉన్నారనే విషయంపై సంబంధిత అధికార యంత్రాంగం, సహాయక సంస్థలతో కలిసి సమాచారం సేకరిస్తున్నామని తెలిపింది. వీలైనంత త్వరగా ఆయనతో సంబంధాలు ఏర్పరచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంది. ఇదే సమయంలో గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ నిరంతరం సంప్రదింపులు జరుపుతూ.. వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది.

**ఎవరీ ల్యాక్స్ గోపిశెట్టి?**



ల్యాక్స్ గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు అధ్యక్షుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఇన్ఫోసిస్‌కు అనుబంధ సంస్థగా ఉన్న ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ ప్రధానంగా అమెరికా, కెనడాలోని ప్రభుత్వ రంగ సంస్థలకు సాంకేతిక సేవలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్స్ అందిస్తుంది. ఈ సంస్థకు నాయకత్వం వహిస్తున్న గోపిశెట్టి.. పబ్లిక్ సెక్టార్ టెక్నాలజీ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

**నేపాల్‌లో తీవ్ర బీభత్సం**

నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు, భారీ వర్షాలు విస్తృతంగా విధ్వంసం సృష్టించాయి. పలు ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాది మంది ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని సమాచారం. వరదల కారణంగా స్థానికులతో పాటు విదేశీయులు, భారతీయులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం.. వరదల అనంతరం సుమారు 320 మంది భారతీయుల ఆచూకీ తెలియకుండా పోయింది. మరోవైపు చైనా సరిహద్దు ప్రాంతాల్లో కూడా వందలాది మంది చిక్కుకున్నట్లు సమాచారం. పరిస్థితిని పర్యవేక్షిస్తున్న భారత్.. నేపాల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

ప్రస్తుతం గోపిశెట్టి ఆచూకీ కోసం కూడా సంబంధిత అధికారులు, రెస్క్యూ బృందాలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. వరదల కారణంగా తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు సవాళ్లతో కూడుకున్నప్పటికీ.. ఆయనను సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోపిశెట్టి క్షేమంగా బయటపడాలని కుటుంబ సభ్యులు, సహచరులు ఆశిస్తున్నారు.

## అణు గొడుగుపై అనుమానం

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో జపాన్, దక్షిణ కొరియా (ఆర్ఓకే), ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్‌లకు ద్వైపాక్షిక రక్షణ ఒప్పందాల ద్వారా అమెరికా అధికారిక భద్రతా హామీదారుగా ఉంది. ఈ దేశాల వ్యూహాత్మక ప్రణాళికాకర్తలకు, అమెరికా హామీల్లో 'అణు గొడుగు' అని పిలిచే 'విస్తృత అణు నిరోధం' (ఎండ్) కూడా భాగమే. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సోవియట్ యూనియన్, చైనానుంచి వచ్చే ముప్పుల నుంచి తన అణ్వస్త్రరహిత మిత్రదేశాలను రక్షించడానికి అమెరికా ఈ 'ఎండ్' విధానాన్ని రూపొందించింది. మిత్రదేశాలు సొంతంగా అణ్వాయుధాలు నిర్మించుకోవాల్సిన అవసరం లేదని, భారీ దురాక్రమణ జరిగితే అణు ప్రతిచర్యతో బెదిరించి అమెరికాయే నిరోధిస్తుందని ఒప్పించడమే దీని లక్ష్యం. అయితే, గత పదేళ్లలో ప్రపంచ వ్యూహాత్మక పరిస్థితి మరింత అనిశ్చితంగా మారింది. దీర్ఘకాలంగా స్థిరపడిన భద్రతా కూటములు లోపలి నుంచే సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అఫ్గానిస్తాన్‌ను అమెరికా వదిలేయడం, ఉక్రెయిన్-రష్యా సంఘర్షణలో తన పాత్రను భద్రతా బలవర్ధకుడి నుంచి ఆయుధ విక్రేతగా మార్చుకోవడం, తైవాన్‌ను చైనా దురాక్రమణ నుంచి రక్షించడంపై అధ్యక్షుడు ట్రంప్ అస్పష్టమైన వ్యాఖ్యలు చేయడం.. ఇవన్నీ దక్షిణ కొరియా, జపాన్ వ్యూహాత్మక వర్గాల్లో అమెరికా అణు గొడుగుపై విశ్వసనీయతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 2025 ఏప్రిల్‌లో అసాహి షింబున్ సర్వేలో, సైనిక సంక్షోభంలో అమెరికా జపాన్‌ను రక్షిస్తుందని కేవలం 15 శాతం జపనీయులే నమ్ముతుండగా, 77 శాతం నమ్మడం లేదని తేలింది. 2025 ఆగస్టు టోక్యో విశ్వవిద్యాలయం సర్వేలో, జపాన్‌కు అమెరికా అణు గొడుగు రక్షణ ఉందని కేవలం 39.3 శాతం మంది మాత్రమే అంగీకరించారు. ఇది ఏడాది క్రితంతో పోలిస్తే 5.5 శాతం తగ్గుదల.


దక్షిణ కొరియాకు చైనా, ఉత్తర కొరియా అనే రెండు అణ్వాయుధ దేశాలు పొరుగుదేశాలుగా ఉన్నాయి. ఉత్తర కొరియా అణ్వస్త్రీకరణ ఎన్నటికీ జరగదన్నది వాస్తవిక అంచనా. దీన్ని నిరోధించడానికి దక్షిణ కొరియా వద్ద ఉన్న ఒక ఎంపిక.. 1991లో ఉపసంహరించుకున్న అమెరికా వ్యూహాత్మక అణు ఫిరంగి గోళాలను తిరిగి మోహరించడం. మరో దీర్ఘకాలిక ఎంపిక.. సొంత అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవడం. 1954 నాటి, 2015లో సవరించిన అమెరికా-దక్షిణ కొరియా అణు సహకార ఒప్పందం ప్రకారం, తన అణు రియాక్టర్ల నుంచి వచ్చే వాడిన ఇంధనాన్ని రీప్రాసెస్ చేయడానికి లేదా యురేనియంను శుద్ధి చేయడానికి దక్షిణ కొరియాకు అనుమతి లేదు. దక్షిణ కొరియా వద్ద 5 లక్షలకుపైగా వాడిన ఇంధన కట్టలు నిల్వలున్నాయి. ఇది తన మొత్తం నిల్వ సామర్థ్యంలో 98.1 శాతాన్ని ఆక్రమిస్తోంది. 2025 ఆగస్టులో అధ్యక్షులు ట్రంప్, లీ జే మ్యుంగ్ మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో, రీప్రాసెసింగ్ హక్కుపై చర్చించాలని ఇద్దరు నేతలు అంగీకరించారు. జపాన్‌కు ఇలాంటి హక్కులు ఇప్పటికే ఉన్నాయి. ప్రస్తుతం దక్షిణ కొరియాలో అమెరికా కమాండర్లు 'ఆర్ఓకే/యూఎస్ కంబైన్డ్ ఫోర్సెస్ కమాండ్'కు నేతృత్వం వహిస్తుండగా, 28,000 మంది అమెరికా రక్షణ సిబ్బంది మోహరించి ఉన్నారు. వ్యూహాత్మక నిర్ణయాధికారంలో మరింత భాగస్వామ్యం కోరుతున్న దక్షిణ కొరియా డిమాండ్‌ను పాక్షికంగా సంతృప్తిపరచడానికి, 2023లో బైడెన్, యూన్ ద్వైపాక్షిక అణు సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ వాషింగ్టన్ డిక్లరేషన్‌ను ఆమోదించారు.

జపాన్ విషయానికొస్తే, యురేనియం శుద్ధినుంచి వాడిన ఇంధన రీప్రాసెసింగ్ వరకూ మొత్తం అణు ఇంధన చక్రంపై పూర్తి పట్టు కలిగి ఉండటంతో, దీన్ని ఒక 'గుప్త అణు రాజ్యం'గా పరిగణిస్తారు. అణు పరీక్ష అవసరం లేకుండా, అత్యాధునిక కంప్యూటర్ సిమ్యులేషన్ల ఆధారంగా, విశ్వసనీయమైన క్రియాశీల అణు ఆయుధాగారాన్ని నిర్మించడానికి మూడు నుంచి ఐదేళ్లు పట్టవచ్చని అంచనా. 1945లో హిరోషిమా, నాగసాకిపై జరిగిన అణుదాడుల అనంతరం, జపనీయుల అభిప్రాయం అణ్వాయుధాలకు తీవ్రంగా వ్యతిరేకంగా ఉంది. ప్రస్తుత సనయె తకైచి ప్రభుత్వ మద్దతుదారుల్లోనూ 56.7 శాతం అణ్వాయుధాల సముపార్జనను స్పష్టంగా వ్యతిరేకిస్తున్నారు. దక్షిణ కొరియాలో ఇటీవలి సర్వేలో 76.2 శాతం దీనికి అనుకూలంగా ఉండటానికి ఇది పూర్తి భిన్నం. 1967లో ఆమోదించిన జపాన్ 'మూడు అణ్వాయుధ రహిత సూత్రాలు' అణ్వాయుధాలను కలిగి ఉండటాన్ని, తయారు చేయడాన్ని, జపాన్ భూభాగంలోకి ప్రవేశపెట్టడాన్ని నిషేధిస్తాయి. అయితే, ఒక రహస్య ఒప్పందం కింద జపాన్ జలాల్లో ఉన్నప్పుడు అమెరికా నౌకాదళ నౌకలపై అణ్వాయుధాలను జపాన్ అనుమతిస్తూ వచ్చింది. ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలు, చైనా సైనిక విస్తరణ జపనీయులను కలవరపెడుతున్నాయి. తైవాన్‌ను చైనా స్వాధీనం చేసుకుంటే తన భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతుందని జపాన్ నమ్ముతోంది. తైవాన్‌కు, ఒకినావాకు మధ్య దూరం కేవలం 790 కిలోమీటర్లే.

2025 అక్టోబర్‌లో ఎల్‌డీపీ నాయకత్వం చేపట్టిన తర్వాత, ప్రధాని సనయె తకైచి దివంగత ప్రధాని షింజో అబేను పోలిన మరింత దృఢమైన భద్రతా విధానాన్ని అనుసరిస్తున్నారు. ఆగస్టు 6న హిరోషిమా స్మారక దినోత్సవంలో మాట్లాడుతూ, జపాన్ తన మూడు సూత్రాలను 'కొనసాగిస్తోంది'నని తకైచి పేర్కొన్నా, ఈ విధానం మారకుండా ఉంటుందని హామీ ఇవ్వకపోవడం గమనార్హం. రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి, వేగంగా దిగజారుతున్న ప్రపంచ భద్రతా వాతావరణంలో అణు నిరోధంపై చర్చను నివారించలేమని వాదించారు. అయితే, అమెరికా జలాంతర్గామి క్షిపణి వాహక నౌకలు జపాన్ ఓడరేవులను సందర్శించనందున, తకైచి ప్రకటనలు ఆచరణలో పెద్దగా మార్పు తీసుకురాకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి శాశ్వత సభ్యదేశపు ఎన్నికైన అధ్యక్షుడు, తన మిత్రదేశమైన డెన్మార్క్ నుంచి గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని బెదిరించడం, క్యూబాపై కొనసాగుతున్న ఆర్థిక దిగ్బంధనం నేపథ్యంలో, జపాన్, దక్షిణ కొరియా నాయకత్వం ముందున్న మౌలిక ప్రశ్న ఏమిటంటే - చైనా లేదా ఉత్తర కొరియా అణు బెదిరింపులకు తమ భవిష్యత్ తరాలను బలహీనంగా వదిలేయగలరా అన్నదే. హిరోషిమా, నాగసాకి అణుదాడుల నుంచి 81 ఏళ్లు గడిచిన తర్వాత కూడా, ఈ ప్రశ్నను తప్పించుకోవడమే ఇప్పుడు ఒక వ్యూహాత్మక ఎంపికగా మారుతోంది. అమెరికా విస్తృత అణు నిరోధంపై విశ్వాసం సన్నగిల్లుతున్న ఈ తరుణంలో, జపాన్, దక్షిణ కొరియా తమ భద్రతా భవిష్యత్తును ఎలా రూపొందించుకుంటాయన్నది యావత్ ఇండో-పసిఫిక్ ప్రాంత వ్యూహాత్మక సమతుల్యతకూ కీలకమైన ప్రశ్నగా నిలుస్తోంది.

### పనికొచ్చే పలుకు



## అలాగైతే.. మీరు ఇంటిలిజెంటే..!

జీవితంలో నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం, దాన్ని ఎలా సాధించాలో ప్రణాళిక వేసుకోవడం, సాధించేందుకు కావాల్సిన పనిని క్రమం తప్పకుండా చేయడం.. ఈ మూడు చేయగలిగితే, మీరే తెలివైనవారే. వినడానికి సులువుగా ఉన్నా.. ఆచరణ అంత ఈజీ కాదు. మనలో చాలామంది "నాకు కావాలి" అనే కోరికతోనే గడిపేస్తారు తప్ప, ఏం కావాలో స్పష్టంగా నిర్వచించుకోరు. నిజంగా ఏంకావాలో తెలుసుకోవడం అనుకున్నంత సులభం కాదు. మీ వ్యక్తిగత, నిర్దిష్ట కోరికపై నిజమైన స్పష్టత రావాలంటే, మిమ్మల్ని మీరు నిజాయితీగా ప్రశ్నించుకోవాలి. "ఈ లక్ష్యం నాకు నిజంగా సంతోషాన్నిస్తుందా? లేక ఇతరులను మెప్పించడానికేనా?" అని. ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం దొరికినప్పుడే, మీ అసలైన లక్ష్యం స్పష్టమవుతుంది. రెండో దశ.. ప్రణాళిక వేసుకోవడం. ఇక్కడే చాలామంది తడబడతారు. ఫ్రెంచ్ రచయిత, పైలట్ ఆంతోన్ డి సెయింట్-ఎగ్జుపెరీకి తరచూ ఆపాదించే ఒక ప్రసిద్ధ మాట ఉంది: A goal without a plan is just a wish. అంటే, ప్రణాళిక లేని లక్ష్యం కేవలం కోరిక మాత్రమేనని. కల మాత్రమే ఉంటే సరిపోదు, దాన్ని చేరుకునే మార్గాన్ని నిర్దుష్టంగా గీసుకోవాలి. "నేను బరువు తగ్గాలి" అనేది కోరిక, కానీ "వారానికి ఐదు రోజులు 30 నిమిషాలు వ్యాయామం చేస్తాను, భోజనంలో చక్కెర తగ్గిస్తాను" అనేది ప్రణాళిక. ఈ తేడాను గుర్తించడమే విజయానికి తొలి మెట్టు.

మూడో దశ.. క్రమం తప్పని ఆచరణ. ఇదే అత్యంత కీలకమైనది, కష్టమైనది కూడా. ఎందుకంటే, ప్రేరణ ఎప్పుడూ స్థిరంగా ఉండదు. కొన్ని రోజులు మీకు అమితమైన ఉత్సాహం ఉంటుంది. మరికొన్ని రోజులు ఏమీ చేయాలనిపించదు. ఇక్కడే క్రమశిక్షణ ప్రేరణ కంటే ఎక్కువ ముఖ్యమైనదిగా మారుతుంది. మీరు మూడ్‌తో సంబంధం లేకుండా, రోజూ ఆ చిన్న అడుగును వేస్తూ ఉంటేనే, కాలక్రమేణా అది పెద్ద మార్పుగా రూపాంతరం చెందుతుంది.

స్పష్టత లేనప్పుడు మనం శక్తిని అనేక దిశల్లో వృథా చేస్తాం. ఇది అలసటకు, నిరాశకు దారితీస్తుంది. లక్ష్యం స్పష్టంగా ఉంటే, ప్రతి నిర్ణయం సులభమవుతుంది. ఎందుకంటే "ఇది నా లక్ష్యానికి దగ్గర చేస్తుందా, దూరం చేస్తుందా" అని మాత్రమే ప్రశ్నించుకుంటే సరిపోతుంది. రెండోది, ప్రణాళిక లేకపోతే ప్రతిరోజూ "ఈరోజు ఏం చేయాలి" అని ఆలోచించడంలోనే మానసిక శక్తి వృథా అవుతుంది. ముందుగానే ప్రణాళిక వేసుకుంటే, ఆ శక్తిని అమలుకే వినియోగించవచ్చు. మూడోది, స్థిరత్వం లేకుండా ఎంత గొప్ప ప్రణాళిక ఉన్నా అది కాగితంపైనే మిగిలిపోతుంది. చిన్న, స్థిరమైన అడుగులే దీర్ఘకాలంలో అతిపెద్ద మార్పులను తీసుకొస్తాయి. సో, ప్రతి ఆదివారం, వచ్చే వారానికి మీ ముఖ్యమైన మూడు లక్ష్యాలను రాసుకోండి. ప్రతి లక్ష్యానికి, దాన్ని సాధించడానికి రోజువారీగా చేయాల్సిన నిర్దుష్ట పనిని గుర్తించండి. ఆ పనిని క్యాలెండర్‌లో ఒక అపాయింట్‌మెంట్‌లా షెడ్యూల్ చేసుకోండి. ఇది కేవలం ఆలోచనగా మిగిలిపోకుండా, కార్యాచరణగా మారుతుంది. ప్రతి రాత్రి నిద్రపోయేముందు, ఆ రోజు మీరు వేసిన అడుగును ఒక్కసారి సమీక్షించుకోండి. దీనివల్ల మీ పురోగతిపై స్పష్టత లభిస్తుంది.

గుర్తుంచుకోండి - మేధావితనం అంటే అత్యధిక తెలివితేటలు కలిగి ఉండటం కాదు, ఇది జీవితంలో సరళమైన మూడు సూత్రాలను స్థిరంగా ఆచరించే సామర్థ్యం. మీకు ఏం కావాలో తెలుసుకోండి, దాన్ని చేరుకునే మార్గాన్ని గీసుకోండి, ఆ మార్గంలో ప్రతిరోజూ ముందుకు సాగండి - ఇదే నిజమైన తెలివి, ఇదే నిజమైన విజయానికి రహదారి.

# వెలిగొండ జలస్వప్నం సాకారం!


మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కానుంది. ప్రకాశం పశ్చిమ ప్రాంతంతోపాటు మార్కాపురం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాలను అందించాలన్న మహత్తర లక్ష్యంతో చేపట్టిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ఆగస్టు 31న ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. వెలిగొండ కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదు.. దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న ప్రాంతాలకు జీవనాడిగా, తాగునీటి సమస్యకు పరిష్కారంగా, వ్యవసాయానికి కొత్త ఊపిరిగా భావిస్తున్న ప్రాజెక్టు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని ఎగువ ప్రాంతాలు తక్కువ వర్షపాతం, అనిశ్చిత వర్షాలతో గత ఐదు దశాబ్దాలుగా తీవ్ర కరవును ఎదుర్కొంటున్నాయని కాగ్ నివేదిక కూడా పేర్కొంది. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారంగా 1991లోనే ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం మొదలుకాగా, 1994లో తొలి డీపీఆర్ సిద్ధమైంది. 1996 మార్చి 5న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్వయంగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం విశేషం. అయితే, కేంద్ర అనుమతులు, అటవీ ప్రాంత సమస్యలు, సాంకేతిక సవాళ్లతో పనులు వెంటనే వేగం అందుకోలేదు. 2004లో మరోసారి శంకుస్థాపన జరిగి, 2005లో అధికారికంగా ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, 2006లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నల్లమల కొండల మధ్య శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించేందుకు సుమారు 18.8 కిలోమీటర్ల పొడవైన రెండు సొరంగాలు తవ్వాల్సి రావడం, ఈ ప్రాజెక్టును దేశంలోని అత్యంత క్లిష్టమైన నీటిపారుదల పనుల్లో ఒకటిగా నిలిపింది.

2014లో రాష్ట్ర విభజన తర్వాత వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడం మరోసారి ప్రధాన అంశంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం పనులను వేగవంతం చేయగా, 2018 నాటికి మొదటి సొరంగం పనుల్లో గణనీయమైన పురోగతి నమోదైంది. తదుపరి కాలంలో మొదటి సొరంగం పూర్తికాగా, రెండో సొరంగం తవ్వకం కూడా పూర్తయ్యే దశకు చేరింది. 2024-25 నాటికి రెండు సొరంగాలకు సంబంధించిన కీలక పనులు పూర్తయ్యాయి. అయితే, సొరంగాలు పూర్తవడం మాత్రమే సరిపోదు, వాటినుంచి నల్లమలసాగర్‌కు నీరు చేరేందుకు హెడ్ రెగ్యులేటర్లు, అప్రోచ్ చానల్, ఫీడర్ కెనాల్, మెయిన్ కెనాల్స్, లైనింగ్ వంటి అనేక పనులు పూర్తిచేయాల్సి వచ్చింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలిగొండను అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు పనుల పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ కచ్చితమైన గడువులను నిర్దేశించారు. 2026 ఫిబ్రవరిలో మార్కాపురం పర్యటన సందర్భంగా తొలి దశను జూలైనాటికి పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. అదే నెలలో రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకూ శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.9,081 కోట్లకు చేరగా, ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వం, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు నిధులు కేటాయించింది. ప్రాజెక్టు రెండు దశల్లో అమలు కానుంది -తొలి దశ



పూర్తయితే మార్కాపురం ప్రాంతానికి ప్రధానంగా ప్రయోజనం చేకూరుతూ, సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, దాదాపు 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. పూర్తి ప్రాజెక్టు అమల్లోకి వస్తే సుమారు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మందికి తాగునీరు అందించడం లక్ష్యం. దాదాపు 30 మండలాల్లోని కరవు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు ఇది ప్రయోజనం చేకూర్చనుంది.

వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేకత దాని నీటి తరలింపు వ్యవస్థలోనే దాగివుంది. శ్రీశైలం జలాశయం ఎగువ ప్రాంతంలోని కొల్లంవాగు సమీపంనుంచి కృష్ణా నది వరద జలాలను మళ్లించి, నల్లమల కొండల గుండా సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు తరలిస్తారు. సుమారు 43.5 టీఎంసీ కృష్ణా వరద జలాలను వినియోగించాలనే లక్ష్యంతో ఈ వ్యవస్థను రూపొందించారు. అక్కడి నుంచి తీగలేరు, గొట్టిపడియ, ఈస్టర్న్ మెయిన్ కెనాల్‌వంటి కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు నీటిని తరలిస్తారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కొండల లోపల సొరంగాల ద్వారా నీటిని తరలించడం ఈ ప్రాజెక్టు రూపకల్పనలో కీలక అంశంగా నిలిచింది. వెలిగొండ కథలో మరో ముఖ్యమైన కోణం నిర్వాసితులది. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ భూములు, ఇళ్లు, గ్రామాలను వదులుకోవాల్సి వచ్చిన కుటుంబాల త్యాగం లేకుండా ఈ జల స్వప్నం సాకారం కాదు. అందుకే ప్రాజెక్టు ప్రారంభానికి ముందు పునరావాస పరిహారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆగస్టు 22న మూడో విడతగా రూ.250 కోట్ల పరిహారం అందించగా, మూడు విడతల్లో కలిపి 6,206 కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందింది, ఇది పునరావాస పనుల్లో సుమారు 85 శాతం పూర్తయినట్టు సూచిస్తుంది. నీరు వచ్చిన ప్రాంతంలో కేవలం పంటలు మాత్రమే పెరగవు - గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం మారుతుంది. రైతుల ఆదాయానికి స్థిరత్వం వస్తుంది. పాడి పరిశ్రమ, చిన్న వ్యాపారాలు, రవాణావంటి రంగాలకు ఊతం లభిస్తుంది. భూగర్భజలాలపై ఆధారపడటం తగ్గడంతో బోర్లు, విద్యుత్ వినియోగంపై ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షితమైన ఉపరితల జలాలు అందుబాటులోకి వస్తే ప్రజారోగ్య పరంగానూ దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుంది. 1996లో శంకుస్థాపన చేసిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు మూడు దశాబ్దాల తర్వాత తొలి దశను స్వయంగా ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నానని ఆయనే ప్రస్తావించడం విశేషం. అయితే, వెలిగొండ ప్రయాణం ఒక్క ప్రభుత్వానికి లేదా ఒక్క నాయకుడికి మాత్రమే పరిమితం కాదు మూడు దశాబ్దాలుగా అనేక ప్రభుత్వాలు, ఇంజినీర్లు, కార్మికులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగమయ్యారు. మధ్యలో వచ్చిన ఆటంకాలు, ఆలస్యాలు, రాజకీయ మార్పులు, సాంకేతిక సవాళ్లు అన్నింటినీ దాటి ప్రాజెక్టు ఈ దశకు చేరుకుంది. అందుకే ఆగస్టు 31 కేవలం ఒక ప్రాజెక్టు ప్రారంభోత్సవ తేదీ కాదు. కరవు ప్రాంతాల ప్రజల దీర్ఘకాల నిరీక్షణకు ముగింపు పలికే రోజు. నల్లమల కొండలను దాటి కృష్ణమ్మ తొలిసారి ఈ కరవు నేలలను పలకరించే చారిత్రక సందర్భం. మూడు దశాబ్దాల క్రితం వేసిన విత్తనం నేడు జలధారగా మారబోతోంది. 1.19 లక్షల ఎకరాలకు తొలి దశలో నీరు, భవిష్యత్తులో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మందికి తాగునీరు అందించే భరోసానిస్తూ, ప్రకాశం పశ్చిమ ప్రాంతం నుంచి మార్కాపురం, నెల్లూరు, కడప వరకు విస్తరించే ఈ జలప్రయాణం కేవలం పొలాలను తడపడం కాదు.. దశాబ్దాలుగా కరవుతో పోరాడుతున్న ప్రజల జీవితాల్లో కొత్త ఆశలను నింపే ప్రయాణం. అందుకే వెలిగొండ తొలి దశ ప్రారంభం, ఆంధ్రప్రదేశ్ జలచరిత్రలో ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. ■



ఇంటర్నెట్ మన జీవితాలను సులభతరం చేయడమే కాకుండా, మన అలవాట్లను, ఓర్పునూ మార్చేసింది. ఒకప్పుడు ఎవరితోనైనా మాట్లాడాలంటే ఓపికగా వేచి చూసే వాళ్లం. కానీ, ఇప్పుడు రిప్లై కాస్త ఆలస్యమైతేనే ఏదో జరిగిపోయిందని కంగారు పడుతున్నాం. ఖాళీ దొరికితే చాలు ఆటోమేటిక్గా ఫోన్ చూస్తున్నాం. సమాచారం, వినోదం ఇలా ప్రతిదీ వెంటనే రావాలనుకోవడం మనలోని సహనాన్ని పూర్తిగా తగ్గించేస్తోంది. ఇంటర్నెట్ వేగాన్ని మనం అందిపుచ్చుకున్నామేమో గానీ, జీవితంలో నిజమైన సంతృప్తినిచ్చే నిదానాన్ని మాత్రం కోల్పోయాం. ఓపిక అనేది ఇప్పుడు అరుదైన నైపుణ్యంగా మారింది - దాన్ని తిరిగి పెంచుకోవడమే మన ముందున్న అసలైన సవాలు.

-మహాదేవ

### వింతల్లో వింతలు


## యంత్ర మానవుడి మెరుపు వేగం!



చైనా రోబోటిక్స్ దిగ్గజం 'యూనీట్రీ' రూపొందించిన 'సూపర్‌మ్యాన్' హ్యూమనాయిడ్ రోబో, చరిత్రలోనే అత్యంత వేగవంతమైన మనిషిగా పేరొందిన ఉసేన్ బోల్ట్ రికార్డును అధిగమించింది. ఆగస్టు 17న విడుదల చేసిన వీడియోలో, ఈ రోబో గంటకు 45.6 కిలోమీటర్ల వేగంతో (సెకనుకు 12.66 మీటర్లు) పరుగెత్తడం చూపించారు. బోల్ట్ నమోదు చేసిన గంటకు 44.17 కిలోమీటర్ల వేగాన్ని ఇది మించిపోయింది. వికారంగా కనిపించే బాహ్య రూపమున్నా, ఈ రోబో ఏకంగా 2 మీటర్ల ఎత్తు నిలువు దూకుడు కూడా ప్రదర్శించి, కాళ్లపై స్థిరంగా దిగడం విశేషం. 2021లో క్రిస్టోఫర్ స్పెల్ నెలకొల్పిన 1.7 మీటర్ల రికార్డును ఇది అధిగమించింది. అయితే, యూనీట్రీ వెల్లడించిన ఈ గణాంకాలను ఇంకా స్వతంత్రంగా ఎవరూ ధృవీకరించలేదు. కొన్ని నెలల క్రితం డజన్ల కొద్దీ రోబోలతో సమకాలీకరించిన మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనతో సంచలనం సృష్టించిన యూనీట్రీ, అదే సమయంలో కొన్ని రోబోలు అనూహ్యంగా ప్రవర్తించి మనుషులను కొట్టడంతో వివాదాన్ని కూడా మూటగట్టుకుంది. అలాంటిదేమీ జరగలేదుగానీ, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన హ్యూమనాయిడ్ రోబో అలా ప్రవర్తిస్తే మాత్రం పరిస్థితి ఊహించుకోండి!

# పిల్లల్లో కిడ్నీ రాళ్లు.. కారణాలేంటి? ఎందుకొస్తాయి? వస్తే ఏం చేయాలి?

పెద్దల్లోనే ఎక్కువనుకునే కిడ్నీ రాళ్ల సమస్య ఇటీవల పిల్లల్లోనూ పెరిగిపోతోంది. పుట్టుకతో వచ్చే లోపాలు, జన్యుపరమైన అంశాలకు తోడు మారిపోతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు,, అపరిశుభ్రత, విటమిన్ల లోపం వంటివెన్నో దీనికి ఆజ్యం పోస్తున్నాయి. పెద్దవారికైనా, పిల్లలకైనా కిడ్నీ రాళ్ల బాధ ఒకటే గానీ చిన్నారుల్లో దీన్ని గుర్తించటం కాస్త కష్టం. నొప్పి ఎక్కడ్నుంచి వస్తోందో, ఎటు నుంచి ఎటు వెళ్తోందో పిల్లలు సరిగా చెప్పలేరు. ఈ నేపథ్యంలో పిల్లల్లో కిడ్నీ రాళ్లు , వాటితో కలిగే నష్టాలు, నివారణ మార్గాల గురించి తెలుసుకొని ఉండటం ఎంతైనా అవసరం.



### ఎక్కడివీ రాళ్లు?

కిడ్నీలో రాళ్లు ఎక్కడో బయటి నుంచి వచ్చి చేరేవి కావు. లోపల తయారయ్యేవే. నీటిలో బాగా ఉప్పు వేసి మరిగించారనుకోండి. కొంతసేపటికి నీరంతా ఇగిరిపోయి.. గిన్నెలో ఉప్పు రాళ్లు ఏర్పడతాయి కదా. కిడ్నీ రాళ్లూ ఇలాగే తయారవుతాయని అనుకోవచ్చు. వీటికి మూలం– మూత్రంలో క్యాల్షియం, ఆక్సలేట్, యూరిక్ ఆమ్లం వంటి లవణాలు, ఖనిజాలు, రసాయనాల స్థాయిలు పెరగటం. దీంతో మూత్రం చిక్కబడుతుంది. క్రమంగా దానిలోని లవణాలు, రసాయనాలన్నీ చిన్న చిన్న స్ఫటికాలుగా గూడుకట్టుకోవటం ఆరంభిస్తాయి. ఇవి మొదట్లో కిడ్నీలో మూత్రం నిల్వ ఉండే వ్యవస్థలో పోగుపడి.. లోపలి పైపొర మీద అంటుకుంటాయి. దాని మీద మరొక స్ఫటికం.. దానిపై మరోటి.. ఇలా చేరుకుంటూ వచ్చి, చివరికి రాళ్ల మాదిరిగా గట్టిపడిపోతాయి.

### లక్షణాలు

నొప్పి, మంట: మూత్రనాళం ఒంపుల్లో రాళ్లు చిక్కుపడితే తీవ్రమైన నొప్పి తలెత్తుతుంది. నొప్పి నడుం దగ్గర పక్కలవైపు మొదలై.. గజ్జల వరకూ పాకుతుంది. మూత్రం పోస్తున్నప్పుడు మంట పుట్టొచ్చు. చిక్కేంటంటే– నొప్పి పుడుతున్నా పిల్లలు ఎక్కడ్నుంచి వస్తుందో సరిగ్గా చెప్పలేకపోవటం. నొప్పి ఎక్కడ్నుంచి వస్తుందని అడిగితే కడుపు చూపిస్తారు. దీంతో ఒక్కోసారి అపెండిక్స్ వాపుగానూ పొరపడొచ్చు.

మూత్రం సరిగా రాకపోవటం: ముఖ్యంగా మూత్రనాళంలో గానీ మూత్రమార్గంలో గానీ రాయి చిక్కుపడితే మూత్రం పోయటానికి ఇబ్బంది పడతారు. కొన్నిసార్లు మూత్రంలో రక్తం కనపడొచ్చు.

వాంతి, వికారం: సమస్య తీవ్రంగా ఉంటే వాంతి, వికారం వేధిస్తుంటాయి.

తరచూ మూత్రం: పిల్లలు తరచుగా మూత్రం పోస్తుంటారు. కొంతమంది మగపిల్లలు అదేపనిగా అంగాన్ని పట్టుకొని లాగుతుంటారు.

**జ్వరం:** మూత్రం నిల్వ ఉండటం వల్ల ఇన్ఫెక్షన్ తీవ్రమైతే జ్వరం, చలి, బలహీనత ముంచుకురావొచ్చు. మూత్రం చెడువాసన కొట్టొచ్చు.

### దుష్పరిణామాలతో జాగ్రత్త!

కిడ్నీ రాళ్లు ఇతరత్రా దుష్ప్రభావాలకూ దారితీస్తాయి. మూత్రనాళంలో అడ్డంకి మూలంగా మూత్రం వెనక్కి వెళ్లిపోయి కిడ్నీ వాపు (హైడ్రోనెఫ్రోసిస్) తలెత్తొచ్చు. చివరికిది కిడ్నీ దెబ్బతినటానికీ దారితీయొచ్చు.

మూత్రాశయంలో మూత్రం ఎక్కువసేపు నిల్వ ఉంటే దీర్ఘకాల ఇన్ఫెక్షన్ (సిస్టైసిస్) రావొచ్చు.

మూత్రనాళం సంకోచించటం వల్ల ఇతర అవయవాలకు దారులు (ఫిస్ట్యులా) ఏర్పడొచ్చు.

మూత్రాశయం ఉబ్బిపోయి తరచూ మూత్రం రావొచ్చు.

### ప్రధానంగా నాలుగు రకాలు

కిడ్నీ రాళ్లలో ప్రధానంగా నాలుగు రకాలు కనబడుతుంటాయి.

క్యాల్షియం రాళ్లు: మూత్రంలో క్యాల్షియం, ఆక్సలేట్, యూరియా మోతాదులు అధికంగా.. సిట్రేట్ చాలా తక్కువగా ఉండడం వల్ల ఇవి ఏర్పడతాయి.

స్ట్రువైట్ రాళ్లు: వీటికి మూలం దీర్ఘకాల మూత్ర ఇన్ఫెక్షన్లు. ఇన్ఫెక్షన్ కారక బ్యాక్టీరియా మూత్రంలో రసాయనాల స్థాయులను అస్తవ్యస్తం చేయటం వల్ల ఇవి పుట్టుకొస్తాయి.

యూరిక్ ఆమ్లం రాళ్లు: మూత్రంలో ఆమ్ల గుణం పెరిగినప్పుడు యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది స్ఫటికాలుగా మారి రాళ్లు ఏర్పడతాయి.

**సిస్టిన్ రాళ్లు:** జన్యుపరంగా కొందరికి రక్తంలోని సిస్టిన్ రసాయనం సరిగా బయటకు వెళ్లిపోదు. ఫలితంగా దీని మోతాదులు పెరిగి రాళ్లుగా మారుతుంటాయి.

### కారణాలు ఎన్నెన్నో..

పుట్టుకతో వచ్చే మూత్రకోశ లోపాల దగ్గర్నుంచి విటమిన్ల లోపం, ఆహార అలవాట్ల వరకూ ఎన్నెన్నో కారణాలు కిడ్నీరాళ్లకు దారితీయొచ్చు.

జన్యుపరంగా: కొందరికి జన్యుపరంగా మూత్రంలో సిస్టిన్ ఎక్కువగా పోవటం రాళ్లకు దారితీయొచ్చు.

మూత్రం ఆపుకోవటం: టీవీ చూస్తూనో, ఆటల్లో మునిగిపోయో కొందరు చాలాసేపు మూత్రం ఆపుకొంటూ ఉంటారు. ఇలా మూత్రం నిల్వ ఉంటే ఇన్ఫెక్షన్లు రావొచ్చు. లవణాలు పెద్దమొత్తంలో పేరుకుపోవచ్చు. ఇవి రెండూ రాళ్లకు దారితీసేవే.

నీటిశాతం తగ్గటం: పిల్లలు ఏదో వ్యాపకంలో మునిగిపోయి నీళ్లు తాగటం మరచిపోతుంటారు. కొందరికి చిన్నపేగుల్లో ఇన్ఫెక్షన్ల మూలంగానూ ద్రవాలు సరిగా గ్రహించక ఒంట్లో నీటిశాతం తగ్గొచ్చు. దీంతో మూత్రం గాఢంగా, చిక్కగా తయారై.. రాళ్లు ఏర్పడే ప్రమాదముంది.

ఉప్పు ఎక్కువగా తినటం: ప్రస్తుతం జంక్ఫుడ్ తినటం ఎక్కువైంది. పేద కుటుంబాల్లో పచ్చళ్ల వంటివి తినటమూ ఎక్కువే. వీటిల్లో ఉప్పు (సోడియం) పెద్దమొత్తంలో ఉంటుంది. సోడియంతో మూత్రంలో క్యాల్షియం మోతాదులు పెరిగిపోయి రాళ్లకు దారితీయొచ్చు.

యూరిక్ ఆమ్లం పెరగటం: జంతువుల ప్రోటీన్ మూలంగా యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. మూత్రంలో దీని మోతాదులు పెరిగిపోయి రాళ్లు ఏర్పడొచ్చు. మూత్రంలో ఎక్కువ ఆమ్ల స్వభావం ఉన్నా ఇవి ఏర్పడొచ్చు.

మూత్రనాళం ఇరుకు: కొందరికి పుట్టుకతో మూత్రనాళంలో కొన్నిచోట్ల సన్నగా, ఇరుకుగా ఉంటుంది. కొందరికి కిడ్నీ, మూత్ర నాళం కలుసుకునే చోట అడ్డంకి ఉండొచ్చు. దీంతో మూత్రం కిందికి సరిగా వెళ్లక, ఎక్కువసేపు నిల్వ ఉండటం వల్ల ఇన్ఫెక్షన్లు.. ఫలితంగా రాళ్లు ఏర్పడొచ్చు.

**ఊబకాయం:** ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. దీంతో మూత్రంలో క్యాల్షియం మోతాదులూ ఎక్కువవుతాయి. ఇది రాళ్ల ముప్పు పెరిగేలా చేస్తుంది.

కొన్ని మందులు: అసిటిజోలమైడ్, యాంటాసిడ్లు, గ్లూకోకార్టికాయిడ్ల వంటి మందులూ రాళ్లకు దారితీయొచ్చు. మూర్ఛతో బాధపడేవారు ఎక్కువగా మందులు తీసుకోవటమూ కారణం కావొచ్చు.

వెన్నుపాము లోపాలు: వెన్నుపాము లోపాలతో పుట్టిన పిల్లల్లో మూత్రాశయం సరిగా పనిచేయకపోవటం మూలంగా మూత్రం ఎక్కువసేపు అక్కడే ఉండిపోయి రాళ్లు ఏర్పడొచ్చు.

నివసించే ప్రదేశం: భూగర్భంలో 'కఠిన జలం' ఉన్న ప్రాంతాల్లో నివసించేవారికి కిడ్నీ రాళ్లు వచ్చే అవకాశం ఎక్కువ.

పేదరికం: పేద పిల్లలకు కిడ్నీ రాళ్ల ముప్పు ఎక్కువ. దీనికి ప్రధాన కారణం అపరిశుభ్రత, సరైన పోషకాహారం తీసుకోకపోవటం.

విటమిన్ ఎ లోపం: విటమిన్ ఎ లోపం మూలంగా మూత్రాశయం లోపలి గోడ పొరలు పొరలుగా ఊడుతుంటుంది. వీటిల్లో ఏదైనా పొర ఎక్కడైనా స్థిరపడితే దాని చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి చివరికి రాయిగా మారుతుంది.

### నిర్ధారణజి

నొప్పి, మూత్రం మంట వంటి లక్షణాలతోనే కిడ్నీ రాళ్లను అనుమానిస్తారు. రాళ్లు ఉన్నట్టు అనిపిస్తే తగు పరీక్షలు చేసి నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

ఎక్స్రే: ఇది ప్రధానమైన పరీక్ష. మూత్రకోశం ఎక్స్రే తీస్తే రాళ్లు ఎక్కడున్నాయనేది తెలుస్తుంది. 80% వరకు రాళ్లు ఎక్స్రేలోనే కనపడతాయి. అవసరమైతే అల్ట్రాసౌండ్, సీటీస్కాన్ పరీక్షలూ చేయాల్సి వస్తుంది. వీటితో రాయి ఉందా లేదా? ఉంటే ఎక్కడుంది? మూత్రపిండాలు ఎలా పనిచేస్తున్నాయి? ఎక్కడైనా ఉబ్బాయా? అనేవి బయటపడతాయి.

మూత్రపరీక్ష: రసాయనాలు, లవణాల మోతాదులు.. ఇన్ఫెక్షన్ కారక బ్యాక్టీరియా ఇందులో తెలుస్తాయి.

మూత్ర పరిమాణం: పిల్లల విషయంలో 24 గంటల వ్యవధిలో మూత్రం ఎంత వస్తోందనేది చూడటం చాలా ముఖ్యం. థైరాయిడ్ పరీక్ష: అవసరమైతే పారాథైరాయిడ్ గ్రంథి పనితీరు పరీక్ష చేస్తారు.

### చికిత్స– రాయిని బట్టి..

చిన్న చిన్న రాళ్లు వాటంతటవే బయటకొచ్చేస్తాయి. కొన్నిసార్లు ఇవి మూత్రనాళంలో, మూత్రమార్గంలో చిక్కుకొని పోవచ్చు. కొన్ని రాళ్లు.. ముఖ్యంగా ఆక్సలేట్ రకం రాళ్లు కిడ్నీ లోపలి పొర కణజాలానికి కరచుకొని అలాగే ఉండిపోతుంటాయి. పెద్దగానూ అవుతుంటాయి. అందువల్ల రాయి పరిమాణం, అది ఎక్కడుంది? ఇతరత్రా ఇబ్బందులేంటి? అనేవి దృష్టిలో పెట్టుకొని చికిత్స చేయాల్సి ఉంటుంది.

### చిన్నరాళ్లకు..

సాధారణంగా 3–5 మి.మీ. సైజు రాళ్ల విషయంలో పెద్దగా కంగారు పడాల్సిన పనిలేదు. పిల్లలు నీళ్లు ఎక్కువగా తాగేలా చూసుకుంటే క్రమంగా బయటకు వచ్చేస్తాయి. అదే రాయి కాస్త పెద్దగా (5–8 మి.మీ.) ఉందనుకోండి. మూత్రపిండాలు సరిగా పనిచేస్తూ.. పెద్దగా వాపు, నొప్పి లేవనుకోండి. ఇలాంటి పరిస్థితుల్లో నొప్పి మాత్రలు, నార్కొటిక్స్తో మంచి ఉపశమనం లభిస్తుంది. వాంతి, వికారం తగ్గటానికి తగు మందులు వాడుకోవాల్సి ఉంటుంది.

### పెద్దరాళ్లకు..

రాళ్లు 8 మి.మీ. కన్నా పెద్దగా ఉండి.. మూత్రపిండాల పనితీరు దెబ్బతింటూ.. తీవ్రమైన నొప్పి (రీనల్ కోలిక్), జ్వరం వేధిస్తున్నట్టయితే వెంటనే రాళ్లను బయటకు తీయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆపరేషన్ అవసరం లేకుండానే రాళ్లను తొలగించే పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

ఎక్స్ట్రాకార్పొరల్ షాక్ వేవ్ లిథోట్రిప్సీ: ఇందులో బయటి నుంచి శబ్ద లేదా షాక్ తరంగాల సాయంతో రాళ్లను పగలగొడతారు. దీంతో అవి ముక్కలు ముక్కలై మూత్రం ద్వారా పడిపోతాయి. ముక్కలు లోపల చిక్కుకోకుండా మూత్రనాళంలో స్టెంట్ అమర్చుతారు. దీంతో అవి తేలికగా బయటకు వచ్చేస్తాయి. ఈ చికిత్సకు సుమారు 45 నిమిషాలు పడుతుంది.

యురెటెరోస్కోపిక్ పద్ధతి: మూత్రనాళంలో రాయి చిక్కుకున్నవారికిది ఉపయోగపడుతుంది. ఇందులో మూత్రమార్గం ద్వారా యురెతోరోస్కోపీని లోపలికి పంపించి రాయిని తీయొచ్చు లేదా పగలగొట్టొచ్చు.

ఆపరేషన్: 2 సెం.మీ. కన్నా ఎక్కువుండే రాళ్లకు కీహోల్ విధానంలో చిన్న రంధ్రం చేసి లోపలికి వెళ్లి రాయిని ముక్కలు చేయాల్సి ఉంటుంది. కిడ్నీలో మూత్రనాళం కలిసే చోట ఏర్పడే రాళ్లు (స్టాగ్హార్న్) కదలకుండా అక్కడే అతుక్కుపోతాయి. ఇలాంటివాటిని చిన్న కోతతో నెఫ్రోలిథాటమీ పద్ధతిలో ఆపరేషన్ చేసి తీస్తారు.

### నివారణ ఉత్తమం

నీళ్లు, ద్రవాలు ఎక్కువగా తీసుకునేలా చూడాలి.

కూల్డ్రింకుల వంటి వాటికి దూరంగా ఉంచటం మంచిది.

ఉప్పు, కొవ్వులు మితంగా తినేలా చూసుకోవాలి.

రోజూ తప్పకుండా ఆరుబయట ఆటలు ఆడేలా ప్రోత్సహించాలి. రాళ్లు ఏర్పడే స్వభావం ఉన్న పిల్లలకు టమోటా, క్యాబేజీ, పాలకూర తక్కువగా ఇవ్వాలి.

# నెలసరి నిలిచాక..



మహిళల్లో 45–55 ఏళ్లలో రుతుక్రమం ఆగిపోతుంటుంది (మెనోపాజ్). దీనికి ఐదు నుంచి ఎనిమిదేళ్ల ముందు నుంచే మార్పులు మొదలవుతుంటాయి. దీన్నే పెరిమెనోపాజ్ దశ అంటారు. ఈ సమయంలో హార్మోన్ల మోతాదుల్లో హెచ్చుతగ్గులు, నెలసరి సమయానికి రాకపోవటం, రుతుస్రావం మరీ ఎక్కువగా లేదా తక్కువగా అవటం వంటి వ్యత్యాసాలు కనిపిస్తుంటాయి. కొన్నిసార్లు నెల మొత్తంలో అసలు రుతుస్రావమే కాకపోవచ్చు. వరుసగా ఏడాది వరకూ నెలసరి రానట్టయితే ముట్లు పూర్తిగా నిలిచిపోయాయనే అర్థం. ఇది కొన్ని సమస్యలు, ఇబ్బందులకూ దారితీస్తుంది.

బరువు పెరగటం: నెలసరి నిలిచిన తర్వాత ఈస్ట్రోజన్ హార్మోన్ మోతాదులు గణనీయంగా పడిపోతాయి. దీంతో జీవక్రియల వేగం తగ్గుతుంది. వ్యాయామం తగ్గించకపోయినా, తిండి ఎక్కువగా తినకపోయినా కూడా 10 నుంచి 12 కిలోల బరువు పెరుగుతుంటారు. ఇదంతా తుంటి వద్ద కాకుండా అవయవాల చుట్టూరా కొవ్వు రూపంలో పోగుపడుతుంది. అదే సమయంలో కండర మోతాదూ క్రమంగా తగ్గుతూ వస్తుంటుంది.

చర్మం ముడతలు: చర్మం ఆరోగ్యంగా ఉండటంలోనూ ఈస్ట్రోజన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది తగ్గుతున్నకొద్దీ చర్మాన్ని బిగుతుగా, నిగనిగలాడుతూ ఉంచే కొలాజెన్, ఎలాస్టిన్ ప్రొటీన్లూ పడిపోతాయి. ఫలితంగా చర్మం వదులుగా అవుతుంది. ముడతలు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంటాయి.

జుట్టూ ప్రభావితమవుతుంది. వెంట్రుకలు పొడిబారతాయి. పెళుసుగా అవుతాయి. కళ తప్పుతాయి. వెంట్రుకల కుదుళ్లు క్రమంగా క్షీణిస్తుంటాయి. కొత్తవి పుట్టుకురావు. దీంతో జుట్టు పలుచబడుతుంది.

ఒకవైపు ఈస్ట్రోజన్ తగ్గటం, మరోవైపు మగ హార్మోన్ టెస్టోస్టిరాన్ పెరగటం మూలంగా పెదవులు, చుబుకం, దవడ మీద అవాంఛిత రోమాలూ మొలవచ్చు. మొదట్లో ఇవి సన్నగా ఉంటాయి గానీ రాన్రానూ దళసరిగా మారతాయి.

వేడి ఆవిర్లు: మెదడులోని హైపోథలమస్ గ్రంథి శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంటుంది. ఈస్ట్రోజన్ పడిపోయినప్పుడు ఇది అతిగా స్పందించటం మొదలెడుతుంది. శరీరం బాగా వేడిక్కిందనే తప్పుడు సంకేతాలు ఇస్తుంటుంది. దీంతో వేడి ఆవిర్లు వస్తుంటాయి. చెమట పోస్తుంటుంది. కొన్నిసార్లు వణుకూ రావచ్చు. రాత్రిపూట వేడి ఆవిర్లు వస్తున్నట్టయితే నిద్ర కూడా అస్తవ్యస్తమవు తుంటుంది.

నిద్రలేమికి, ఈస్ట్రోజన్ తగ్గటమూ తోడైతే మతిమరుపు, ఏకాగ్రత కొరవడటం వంటివీ తలెత్తుతాయి.

గుండెజబ్బు ముప్పు: మహిళలను గుండెజబ్బుల నుంచి ఈస్ట్రోజన్ బాగా రక్షిస్తుంది. అయితే నెలసరి నిలిచిన పదేళ్ల తర్వాత ఈ రక్షణ పోతుంది. అప్పుడు మగవారితో సమానంగా గుండె జబ్బుల ముప్పు పొంచి ఉంటుంది.

ఈస్ట్రోజన్ తగ్గటం వల్ల ఎముక క్షీణతా పెరుగుతుంది. దీంతో ఎముకలు గుల్లబారటం, విరిగే అవకాశం ఎక్కువవుతుంది.

### ఉపశమన మార్గాలు

మహిళల జీవిత చక్రంలో నెలసరి నిలవటమనేది సహజ ప్రక్రియ. దీంతో ముంచుకొచ్చే ఇబ్బందులను తగ్గించుకోవటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

వేడి ఆవిర్లను ప్రేరేపించే కాఫీ, మసాలా పదార్థాలు తగ్గించుకోవాలి. మద్యం, పొగాకు జోలికి వెళ్లొద్దు. పరిసరాలు చల్లగా ఉండేలా చూసుకోవాలి. ఫ్యాన్, ఏసీ వాడుకోవాలి. తేలికైన నూలు దుస్తులు ధరించాలి.

అవాంఛిత రోమాలను క్రీములు, థ్రెడింగ్, షేవింగ్ లేదా వ్యాక్సింగ్తో తొలగించుకోవచ్చు.

శారీరక శ్రమ అంతగా చేయనివారికి వేడి ఆవిర్లు, నిద్రలేమి, ఎముక గుల్లబారటం, మతిమరుపు, గుండెజబ్బుల ముప్పు ఎక్కువ. కాబట్టి రోజుకు కనీసం అరగంట సేపు వ్యాయామం చేయాలి. నడక, సైకిల్ తొక్కటం, ఈదటం, డ్యాన్స్ వంటివి ఏవైనా మేలే. బయటకు వెళ్లటం కుదరకపోతే ఇంట్లోనైనా 8 ఆకారంలో నడవటం మంచిది. వారానికి రెండు సార్లు ఒకట్రెండు కిలోల డంబెల్స్తో లేదా లీటరు వాటర్ బాటిల్తో బరువులు ఎత్తే వ్యాయామాలు చేయాలి. శరీరం సాగటానికి, తేలికగా కదలటానికి తోడ్పడే యోగాసనాలూ వేయాలి. రోజుకు కనీసం 10 నిమిషాలు ధ్యానం చేస్తే మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఆలోచనలూ సాఫీగా సాగుతాయి.

# ఇతరులతో పోల్చుకోవద్దు.. సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు: సూర్యకుమార్ యాదవ్

- యువ క్రికెటర్లు ఇతరులతో పోల్చుకోవద్దన్న సూర్యకుమార్
- వయసుతో పనిలేదు, సన్నద్ధతే ప్రధానమని స్పష్టీకరణ
- పరుగులు చేస్తూ ఉంటే సెలక్టర్లే వెతుక్కుంటూ వస్తారని భరోసా
- దేశవాళీ క్రికెట్‌లో తాను పడిన కష్టాలను గుర్తు చేసుకున్న స్టార్ బ్యాటర్
- ఎవరూ చూడనప్పుడు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ క్రికెటర్లకు భారత మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక సందేశం ఇచ్చాడు. ఓపిక కోల్పోకుండా పరుగులు చేస్తూ ఉండాలని, తమ సన్నద్ధతపై నమ్మకం ఉంచాలని సూచించాడు. నిలకడగా రాణిస్తే సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారని, మీ బ్యాటే అన్నింటికీ సమాధానం చెబుతుందని భరోసా ఇచ్చాడు. ఎన్నో ఏళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో శ్రమించి, ఆలస్యంగా భారత జట్టులోకి వచ్చి అగ్రశ్రేణి బ్యాటర్‌గా ఎదిగిన తన అనుభవాన్ని సూర్య యువతతో పంచుకున్నాడు.

ఒక యువ క్రికెటర్ ప్రయాణంలో ఓపిక ఎంత ముఖ్యమో వివరిస్తూ, 'ఐఏఎన్ఎస్'తో సూర్యకుమార్ మాట్లాడాడు. "ప్రతి ఒక్కరి కథ వేరు, ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నం. అందుకే యువ క్రికెటర్లు ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దని నేను చెబుతాను. నేను కూడా ఏళ్ల తరబడి ఏజ్-గ్రూప్, దేశవాళీ క్రికెట్ ఆడాను. కిట్ బ్యాగ్‌తో బస్సులు, రైళ్లలో ఎన్నో ప్రయాణాలు చేశాను. నా అవకాశం కోసం ఓపికగా ఎదురుచూశాను" అని తెలిపాడు.

భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్లపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని సూర్యకుమార్ ప్రస్తావించాడు. "మన దేశంలో 21 లేదా 25 ఏళ్లకల్లా జట్టులో చోటు దక్కకపోతే కెరీర్ ముగిసిపోయినట్లేనని, మరో మార్గం చూసుకోవాలని చాలామంది భావిస్తారు. కానీ,

నా దృష్టిలో వయసు అనేది గడువు కాదు, మీ సన్నద్ధతే అసలైన గడువు" అని పేర్కొన్నాడు. ఎవరూ గమనించనప్పుడు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టాలని, కఠోర సాధనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపవద్దని సూచించాడు.

సెలక్టర్ల దృష్టిని ఆకర్షించడానికి ప్రదర్శనలే అత్యంత శక్తిమంతమైన మార్గమని సూర్యకుమార్ అభిప్రాయపడ్డాడు. "క్రికెట్ పరంగా చెప్పాలంటే, మీరు పరుగులు చేస్తూ ఉంటే, మీ బ్యాటే సమాధానం

చెబుతుంది. సెలక్టర్లు కచ్చితంగా మిమ్మల్ని గుర్తిస్తారు. మీరు ఉండాల్సిన సరైన స్థానానికి చేరుకుంటారు" అని భరోసా ఇచ్చాడు. తోటి ఆటగాళ్లతో పోల్చుకుని ఆందోళన చెందే యువతకు సూర్యకుమార్ మాటలు స్ఫూర్తినిస్తున్నాయి. కలకు గడువు తేదీ ఉండదని, నిబద్ధతతో సిద్ధమైతే విజయం తప్పక వరిస్తుందని సూర్య తన కెరీర్ ద్వారా నిరూపించాడు.

# గ్రౌండ్‌లోనే కాదు.. బ్రాండ్ మార్కెట్‌లోనూ మన స్టార్లదే హవా: ఫోర్బ్స్ ఇండియా 2026 రిపోర్ట్!






**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో క్రికెట్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదు.. కోట్ల మంది ఆరాధించే ఒక అతిపెద్ద పండుగ.. టీమిండియా స్టార్ ప్లేయర్లు మైదానంలోకి దిగితే రికార్డులు బ్రేక్ అవుతాయి, అదే వాణిజ్య ప్రపంచంలోకి అడుగుపెడితే బిజినెస్ డీల్స్ దుమ్మురేపుతాయి. ప్రపంచంలోనే ఏ క్రీడాకారులకూ లేనంతటి ఫ్యాన్ బేస్, మార్కెట్ పొటెన్షియల్ భారత క్రికెటర్ల సొంతం. తమ ఆటతీరుతో పాటు మైండ్ బ్లాకింగ్ పర్సనాలిటీ, సోషల్ మీడియా ఇంపాక్ట్‌తో స్టేడియం సరిహద్దులు దాటి కార్పొరేట్ రంగాన్ని ఏలుతున్నారు. ఆటకు వీడ్కోలు పలికినా సరే, వీరి బ్రాండ్ వ్యాల్యూ కొద్దిగా కూడా తగ్గకపోవడం వీరికున్న భారీ క్రేజ్‌కు అద్దం పడుతోంది. తాజాగా ప్రముఖ వ్యాపార పత్రిక వెల్లడించిన ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 (ఖీశీతీఎవం ×అఎఖు హ్రాష్ట్రశీఃర్శీజూజూవతీం 2026) అత్యంత విలువైన సెలబ్రిటీల జాబితాలో ఇండియన్ క్రికెటర్లు తమ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. సినిమా, సంగీతం, క్రీడలు.. ఇలా దేశంలోని అన్ని రంగాల బిగ్ సెలబ్రిటీలను దాటుకుని కింగ్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ (రూ.3,017 కోట్లు), గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా (రూ.2,507 కోట్లు)లను వెనక్కి నెట్టి కోహ్లీ నంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. టీ20, టెస్టుల నుంచి తప్పుకున్నా కోహ్లీకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. బ్రాండ్ విలువ: ఏకంగా రూ.3,542 కోట్లు

**రెండో స్థానంలో కెప్టెన్ కూల్ ధోనీ:**

భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఈ జాబితాలో రెండో భారత క్రికెటర్‌గా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ సుమారు రూ.2,141 కోట్లు. మహీ భాయ్ క్రికెట్‌కు దూరమైనప్పటికీ ధోనీకి ఉన్న అభిమానగణం, వ్యాపార కార్యకలాపాలు, ప్రకటనల ఒప్పందాలు అతడి బ్రాండ్ విలువను భారీగా నిలబెట్టాయి. మొత్తం భారత సెలబ్రిటీల జాబితాలో ధోనీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

**దక్షిణాసియాసంస్కృతి తెలుసుకోవడం**

**మూడో స్థానంలో మాస్టర్ సచిన్:**

క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కూడా ఈ ఫోర్బ్స్ జాబితాలో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సచిన్ బ్రాండ్ విలువ రూ.1,676 కోట్లుగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్ అయి ఎన్నో సంవత్సరాలు గడిచినా.. సచిన్ బ్రాండ్ ప్రభావం మాత్రం కొనసాగుతుంది. మొత్తం సెలబ్రిటీల లిస్టులో ఆయన 8వ స్థానంలో నిలిచాడు.

**నాలుగో స్థానంలో బుమ్రా:**

ఇక భారత క్రికెటర్లలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ జాబితాలో అత్యంత బ్యాండ్ వ్యాల్యూ కలిగిన వారిలో ఒకడిగా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,142 కోట్లుగా నమోదు అయింది. ఫోర్బ్స్ జాబితాలో బుమ్రా మొత్తం 16వ స్థానంలో నిలిచాడు. మైదానంలో భారత పేస్ దళానికి నాయకుడిగా ఎదిగిన బుమ్రా.. వాణిజ్యంగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.


**ఐదో స్థానంలో రోహిత్ శర్మ:**

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ క్రికెటర్ల జాబితాలో ఐదో స్థానాన్ని దక్కించుకున్నాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,055 కోట్లు అని చెప్పాలి.. మొత్తం సెలబ్రిటీల జాబితాలో రోహిత్ 18వ స్థానంలో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి విజయాలు, అభిమానుల్లో ఉన్న ఆదరణ, వాణిజ్య ఒప్పందాలు బ్రాండ్ విలువను పెంచడంలో కీలకంగా మారాయి.

ఫోర్బ్స్ ఇండియా 2026 టాప్--5 జాబితాలో చోటు దక్కించుకున్న ఈ ఐదుగురు భారత క్రికెటర్ల మొత్తం బ్రాండ్ విలువ కలిపితే ఏకంగా రూ.9,556 కోట్లు కావడం విశేషం. గ్రౌండ్‌లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలతో పాటు మైదానం బయట వారికున్న లీడర్‌షిప్ క్వాలిటీస్, సోషల్ ఇమేజ్ ఇండియన్ ఆటగాళ్లను గ్లోబల్ మార్కెట్‌లో తిరుగులేని బ్రాండ్‌లుగా నిలబెడుతున్నాయి.

# ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు."ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం




బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది" అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

# దీపిక మాటలు కాదు.. చేతల్లో చూపించాలి

తాను ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని.. తన కంటే ఎక్కువ సక్సెస్ ఫుల్ అన్నట్లుగా దీపికా పదుకొనే ఇటీవల ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపుతున్నాయి. వేరే హీరో అంటే ఏమో కానీ.. దేశవ్యాప్తంగా తిరుగులేని అభిమానాన్ని సంపాదించుకుని ఇండియాలో బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా అవతరించిన ప్రభాస్‌ను.. వివాదాలకు దూరంగా ఉంటూ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే హీరో మీద పరోక్షంగా తన అక్కసు వెళ్లగక్కడం.. తనతో పోటీ పెట్టుకుని మాట్లాడ్డం.. అతణ్ని కించపరిచేలా మాట్లాడ్డం తెలుగు వాళ్లకే కాదు.. ఇతర భాషల వాళ్లకు కూడా నచ్చట్లేదు. ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేసే దీపికకు ముందు నుంచే సోషల్ మీడియాలో హేటర్స్ ఎక్కువ. తాజా వ్యాఖ్యలతో ఆమె మీద వ్యతిరేకత మరింత పెరిగిపోతోంది. దీపిక పాస్ట్ ఎఫైర్ల దగ్గర్నుంచి.. వివిధ సందర్భాల్లో ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోల వరకు తీసుకొచ్చి ఆమెను ట్రోల్ చేస్తున్నారు. ఇదంతా పక్కన పెడితే.. ప్రభాస్ కంటే తాను పెద్ద స్టార్ అన్నట్లు చెప్పుకుంటూ తనకు దీటుగా పారితోషకం డిమాండ్ చేస్తున్న దీపికకు నెటిజన్లు ఒక సలహా ఇస్తున్నారు. నిజంగా దీపిక అంత పెద్ద స్టార్, తనకు భారీ మార్కెట్ ఉందని నమ్ముతున్నట్లయితే.. మేల్ సూపర్ స్టార్లతో కలిసి చేసే సినిమాల్ని వారితో పోటీ పెట్టుకునే బదులు ఒక లేడీ ఓరియెంటెడ్ మూవీ చేసి తన బాక్సాఫీస్ స్టామినా ఎంతో రుజువు చేయాలని అంటున్నారు. తనే లీడ్ రోల్ చేసిన సినిమాతో తాను ఎన్ని వందల కోట్లు రాబట్టగలదో చూపిస్తే.. ఆమె ఫాలోయింగ్, మార్కెట్ ఎంత అన్నది అందరికీ అర్థమవుతుంది కదా అని అభిప్రాయపడుతున్నారు. చివరగా దీపిక నటించిన లేడీ ఓరియెంటెడ్ మూవీ 'చప్పక్' అయితే రూ.5' కోట్లకు అటు ఇటుగా వసూళ్లు రాబట్టింది. అది 2020లో రిలీజైన సినిమా. పైగా అదొక ప్రయోగాత్మక చిత్రం. ఇప్పటికి దీపిక మార్కెట్ ఇంకా పెరిగి ఉంటుంది కాబట్టి.. ఇప్పుడు ఒక యాక్షన్ టచ్ ఉన్న లేడీ ఓరియెంటెడ్ సినిమా చేసి దీపిక తన స్టామినా ఏంటో చూపించాలి. ఆ సినిమా ప్రభాస్ చిత్రాల్లాగే వందలు, వేల కోట్ల వసూళ్లు రాబడితే.. అందుకు తగ్గట్లే పారితోషకం కోసం డిమాండ్ చేయొచ్చు. ప్రభాస్ కంటే తానే పెద్ద స్టార్, సక్సెస్ ఫుల్ అని బల్లగుద్ది చెప్పొచ్చు.







Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965